పెద్దలు.. పెళ్లిళ్లు



- వివాహాలపై మారుతున్న యువత ధోరణి
- భాగస్వామి ఎంపికలో తల్లిదండ్రులదే తుది నిర్ణయం
- ప్రస్తుతం జరుగుతున్న వివాహాల్లో 93 శాతం అలాంటివే

8

యూసీలు ఇస్తేనే.. నిధులు!

- స్కూల్ గ్రాంటుకు కేంద్రం మెలికలు
- యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని మెలిక
- వైసీపీ హయాంలో దారిమళ్లిన కేంద్రం నిధులు
- పాఠశాలలు ప్రారంభమై ఐదు నెలలైనా పైసా రాని వైనం



6

భారం.. భరించలేం!

- యాప్‌ల నిర్వహణతో అంగన్‌వాడీలు లబోదిబో
- నాలుగు యాప్‌లు సహా 15 రికార్డుల నిర్వహణ
- మావల్ల కాదంటూ ఆందోళన దిశగా అడుగులు

ఆంధ్రజ్యోతి

గుంటూరు

మంగళవారం 15 అక్టోబరు 2024

ఇసుక తవ్వకాల కోసం పోటీ

- నేడు కలెక్టర్ సమక్షంలో ఖరారు చేయనున్న మైనింగ్ శాఖ
- అయినా వెంటనే రవాణా ప్రారంభించలేని పరిస్థితి
- నేటికీ వరద నీరు ప్రవహిస్తుండటమే కారణం
- ముసురు వర్షంతో అవుట్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు ఇసుక రీచ్‌లలో మనుషుల ద్వారా ఇసుకని తోడేందు కోసం గనులు, భూగర్భ శాఖ పిలిచిన బిడ్‌లకు పోటీ తీవ్రంగా ఉన్నది. మొత్తంగా నాలుగు చోట్ల ఇసుకని తోడి స్టాక్‌యార్డులకు చేర్చేందుకు షార్టు నోటీసు జారీ చేయగా ఒక్కో రీచ్‌కు 10కి పైగా బిడ్‌లు దాఖలైనట్లు మైనింగ్ అధికారులు తెలిపారు. అయితే సీల్డ్ బిడ్‌లు బాక్సుల్లో వేసినందున ఎన్ని దాఖలయ్యాయనేది మంగళవారం కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు సీలు ఓపెన్ చేసిన తర్వాతనే తెలుస్తుందని చెప్పారు. ఇసుక తవ్వకాలపై కన్నేసిన మాఫియా ఏదో ఒక విధంగా మాన్యువల్ ఎక్స్‌కవేషన్ కాంట్రాక్టుని దక్కించుకొని ఆ తర్వాత తన పంథాలో దారి మళ్లించి సొమ్ము చేసుకోవాలన్న తలంపుతో ఉన్నట్లు తెలిసింది. అందులో భాగంగానే మాన్యువల్‌గా చేయడం కష్టమని తెలిసినప్పటికీ ఎక్కువ సంఖ్యలో బిడ్‌లు దాఖలు చేసింది.

ఇసుక నూతన విధానంలో బాలారిష్టాలు ఎదురు కావడంతో వాటిని అధిగమించి ఈ నెల 16వ తేదీ నుంచి సమృద్ధిగా నిల్వలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆన్‌లైన్‌తో పాటు రీచ్‌ల వద్ద బుకింగ్‌కు అనుమతి ఇవ్వనున్నట్లు ప్రకటించింది. చెకింగ్, జీపీఎస్ ట్రాకింగ్, ఆడిట్‌ల ద్వారా నల్లబజారుకు తరలిపోకుండా చూడాలని కూడా ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ప్రభుత్వం నిర్ణయించిన ఇసుక, రవాణ ఛార్జీలకే విక్రయించాలని స్పష్టం చేసింది. అందులో భాగంగా జిల్లాలో కొల్లిపర మండలం మున్నంగి ఇసుక రీచ్‌లో 73,290 మెట్రిక్‌టన్నుల ఇసుకని మాన్యువల్ పద్ధతిలో తోడి స్టాక్‌యార్డుకు చేర్చేందుకు సీల్డ్ బిడ్‌ని మైనింగ్ శాఖ ఆహ్వానించింది. ఇదేవిధంగా బొమ్మువానిపాలెం-14లో 72,600 మెట్రిక్‌టన్నులు, బొమ్మువానిపాలెం-15లో 72 వేల మెట్రిక్‌టన్నులు, తాడేపల్లి మండలంలోని గుండిమెడలో 74,565 మెట్రిక్ టన్నుల ఇసుకని తోడేందుకు బిడ్‌లను ఆహ్వానించగా గత కొన్ని రోజుల నుంచి మైనింగ్ శాఖ వద్ద కాంట్రాక్టర్లు తచ్చాడుతున్నారు. సోమవారం సాయంత్రం 3 గంటల వరకు బిడ్‌లు దాఖలు చేసేందుకు గడువు కావడంతో ఒక్కో రీచ్‌కు 10కి పైగానే బిడ్‌లు వేసినట్లు అధికారులు తెలిపారు.

బిడ్ నిబంధనల ప్రకారం ఇసుకని మాన్యువల్ విధానంలో రీచ్ నుంచి బయటకు తీయాలి. వందల సంఖ్యలో కార్మికులను పెట్టినా ఇసుక తీయడం చాలా కష్టం. ఈ నేపథ్యంలో యంత్రాల వినియోగం లేనిదే సాధ్యం కాదన్నది బహిరంగ రహస్యమే. ఈ కాంట్రాక్టులను ఎలాగైనా దక్కించుకొనేందుకు స్థానికంగా ఆరితేరిన వ్యక్తులు బిడ్‌లు దాఖలు చేశారు. బిడ్‌లు తెరిస్తే తప్ప కాంట్రాక్టర్లు పోటీపడి దాఖలు చేశారా, సిండికేట్ అయి వేశారా అనేది తెలియని పరిస్థితి. కాగా కృష్ణానదిలో వరద ప్రవాహం ఉండటం వలన ప్రకాశం బ్యారేజ్ దిగువకు 40 వేల క్యూసెక్కులకు పైగా విడుదల చేస్తున్నారు. టెండర్లు పిలిచిన ఈ నాలుగు రీచ్‌లు బ్యారేజ్ దిగువనే ఉండటంతో ప్రస్తుతం వాటిల్లో వరద నీరు చేరింది. ఈ కారణంగా మంగళవారం టెండర్లు ఖరారు చేసినా ఇప్పటికిప్పుడు రీచ్‌ల నుంచి ఇసుకని తోడటం సాధ్యపడదని మైనింగ్ డీడీ ధూళిపాళ్ల శ్రీవెంకటసాయి తెలిపారు. కనీసం పది రోజుల సమయం పట్టొచ్చని చెప్పారు.

మద్యం షాపులకు ముగిసిన లాటరీ

- 11 మంది మహిళలకు దక్కిన షాపులు
- ఖజానాకు 103.59 కోట్ల ఆదాయం
- తుళ్ళూరు షాపునకు భలే డిమాండ్



మద్యం షాపులకు లాటరీ తీస్తున్న గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు, ఈఎస్ అరుణ్ కుమారి

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో 127 మంది షాపులకు లాటరీ ప్రక్రియ జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు సోమవారం నిర్వహించారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు లోపు ఈ ప్రక్రియ జరిపించారు. శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ప్రాంగణమంతా ఉదయం 7 గంటలకే నిండిపోయింది. మద్యం షాపుల దర ఖాస్తుదారులు తమ టోకెలను తీసుకొని విజ్ఞాన మందిరానికి చేరుకున్నారు. మద్యం షాపులను దక్కించుకునేందుకు ఈసారి మహిళలు సైతం భారీగా 202 దరఖాస్తులు చేశారు. మొత్తం జిల్లాలో 127 మంది షాపులకు గాను 202 మంది దరఖాస్తు చేశారు. అందులో 11 మందికి మద్యం షాపులు దక్కాయి.

ఖజానాకు భారీగా ఆదాయం..

మద్య షాపుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు గుంటూరు జిల్లా నుంచి భారీగా ఆదాయం చేకూరింది. జిల్లాలో ఉన్న 127 మద్యం షాపులకు గాను మొత్తం 4448 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా రూ. 88.96 కోట్లు వచ్చాయి. సోమవారం షాపులకు లాటరీ నిర్వహించగా అందులో ఎంపికైన వారు లైసెన్స్ ఫీజు లో మొదటి విడతగా 1/6 వంతు చెల్లించడం ద్వారా మరో రూ14.63 కోట్ల రూపాయలు వచ్చాయి. దీంతో ఇప్పటివరకు మద్యం షాపు ల ప్రక్రియ ద్వారా ఖజానాకు రూ 103.59 కోట్ల చేరాయి.

తుళ్లూరులో అత్యధిక దరఖాస్తులు : జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ

గుంటూరు జిల్లాలో తుళ్లూరు మండలంలో మద్యం షాపులకు అత్యధికంగా 95 దరఖాస్తులు వచ్చాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ సోమవారం తెలిపారు. మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియ ముగిసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. లాటరీ ప్రక్రియ ఎంత వీడియోలు తీయించామన్నారు. ప్రతి షాప్ కి ముగ్గురిని ఎంపిక చేసామని అని తెలిపారు. వారిలో మొదటి వ్యక్తి డబ్బు చెల్లిస్తారని అన్నారు. అతను చెల్లించలేని పక్షంలో రెండో వ్యక్తికి, అతను చెల్లించిన పక్షంలో మూడో వ్యక్తికి లైసెన్స్ ఫీజు చెల్లించే అవకాశం కలుగుతుంది అన్నారు. గుంటూరు జిల్లాలో ఉన్న 127 మద్యం షాపులకు ప్రతి షాప్ కి 35 చొప్పున దరఖాస్తులు వచ్చాయన్నారు. లాటరీలో గెలుపొందిన వారు 1/6 లైసెన్సు ఫీజు చెల్లిస్తే అట్టివారికి ప్రొవిజినల్ లైసెన్స్ సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు జెసి తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, గుంటూరు ఎక్సైజ్ శాఖ ఈఎస్ అరుణ కుమారి, ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మద్యం షాపుల లాటరీకి హాజరైన మహిళలు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

పిడుగురాళ్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పనగర్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అయ్యప్పనగర్ సమీపంలో ఆటో యుటర్న్ చేసుకుంటుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న కందుకూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టడంతో ఆటోడ్రైవర్ మలబంటి లక్ష్మయ్య (45) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనలో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తూ కానరాని లోకాలకు



తురకా అంకమ్మ (ఫైల్‌ఫొటో)

దాచేపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గత పది రోజులుగా దేవీశరన్నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు, కోలాటాలు, భక్తిగీతాలతో గడిపారు. ఈ పది రోజుల పాటు మాలధారణ దీక్ష ధరించి శనివారం రాత్రి బతుకమ్మను దాచేపల్లిలోని నాగులేరులో నిమజ్జనం చేసి మాలధారణ దీక్షతోనే విజయవాడ అమ్మవారిని దర్శించుకునేందుకు తన కొడుకుతో కలిసి బయలుదేరారు. మంగళగిరి సమీపంలోని కాజా టోల్‌ప్లాజా వద్ద కారు ఫల్టీకొట్టి డివైడర్‌ను ఢీకొట్టింది. డ్రైవర్ నిద్రమత్తులో చేసిన ప్రమాదంలో మాలధారణ దీక్షలో ఉన్న తురకా అంకమ్మ (43) బలమైన గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమెతో పాటు కారులో ప్రయాణిస్తున్న ఆమె కొడుకు జగదీష్ కొద్దిపాటి గాయాలతో బయటపడ్డారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనధికార పురుగు మందులు సీజ్

సత్తెనపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వడ్డవల్లి ఆంజనేయ స్వామి గుడి ప్రాంతంలో ఒక గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.5,85,240 విలువైన పురుగు మందులను ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి, వీఆర్‌వో అనిల్ ఆధ్వర్యంలో సోమవారం సీజ్ చేశారు. అధికారులకు అందిన సమాచారం మేరకు గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. గోడౌన్ అద్దెకు ఇచ్చిన ఓనరు శివ శంకర ఫెర్టిలైజర్ షాపు నిర్వాహకులు అద్దెకు తీసుకున్నారని తెలియజేశారు. ఈ తనిఖీల్లో బీఏఎస్ఎఫ్ కంపెనీకి సంబంధించిన రూ.61,550 విలువైన పురుగు మందులు, బెస్ట్ అగ్రో లైఫ్ లిమిటెడ్ కంపెనీకి చెందిన రూ.1,10,300 విలువైన పురుగు మందులు, పీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీకి చెందిన రూ.4,13,440 విలువైన పురుగు మందులు, మొత్తం 5,85,240 విలువైన పురుగు మందులను సీజ్ చేసినట్లు శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

యూసీలు ఇస్తేనే.. నిధులు!

- స్కూల్ గ్రాంట్‌కు కేంద్రం మోకాలడ్డు
- యుటిలైజేషన్ సర్టిఫికెట్స్ ఇవ్వాలని మెలిక
- వైసీపీ హయాంలో దారి మళ్లిన కేంద్రం నిధులు
- పాఠశాలలు ప్రారంభమై ఐదు నెలలైనా పైసా రాని వైనం



గుంటూరులోని మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్

గుంటూరు(విద్య), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో సంస్కరణల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలకు నేడు విద్యార్థులు, హెచ్ఎంలు మూల్యం చెల్లించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కేంద్రం విడుదల చేసిన స్కూల్ గ్రాంట్ నిధులు ఇష్టారాజ్యంగా పక్కదారి మళ్లించి పాఠశాలల నిర్వహణను గాలికి వదిలేసిన గత ప్రభుత్వ పాపాలు ఇప్పుడు శాపాలుగా మారుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా పాఠశాలల నిర్వహణకు పైసా నిధులు విడుదల కాలేదు. పాఠశాలల్లో రోజువారీ ఖర్చుల కోసం నిధులు లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు జీతాల్లోంచి వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంది. ఇది ఎన్‌డీఏ ప్రభుత్వానికి సంకటంగా మారింది.

హెచ్ఎంల ఆందోళన

ఉమ్మడి జిల్లాలో 345పైగా ఉన్నత పాఠశాలలు, మరో 4,233 వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో దాదాపు 5.50 లక్షల మందికిపైగా విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ గ్రాంట్స్ విడుదల చేస్తారు. కేంద్రం నుంచి ఏటా జూలై మొదటి వారంలోనే నిధులు వస్తాయి. వాటికి రాష్ట్ర ప్రభుత్వం కొంత మొత్తం (మ్యాచింగ్ గ్రాంట్) నిధులు జోడించి స్కూల్‌గ్రాంట్‌గా విడుదల చేస్తారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన నిధులు వచ్చినట్లు దారి మళ్లించింది. ఈ నిధులు ఎలా వినియోగించారో చెప్పాలని ఇందుకు యూసీలు (యుటిలైజేషన్ సర్టిఫికెట్స్) సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడంతో హెచ్ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు విడుదల, వినియోగం ఇలా...

ప్రభుత్వం స్కూల్ గ్రాంట్ కింద విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు విడుద చేస్తారు. విద్యార్థుల సంఖ్య 1 నుంచి 20లోపు ఉంటే రూ. 10వేలు, 21 నుంచి 50లోపు రూ. 15వేలు, 50 నుంచి 100లోపు ఉంటే రూ. 20వేలు, 101 నుంచి 250లోపు ఉంటే రూ. 50వేలు, 251- నుంచి 1000లోపు ఉంటే రూ.75వేలు, 1000పైగా విద్యార్థులుంటే లక్ష గ్రాంట్స్ విడుదల చేస్తారు. ఈ నిధులతో పాఠశాలలో ఎలక్ట్రికల్ బిల్లు, చాక్‌పీసులు, స్టేషనరీ, మంచినీరు, కంప్యూటర్స్ నిర్వహణ, మోటార్ ఖర్చులు, మరుగుదొడ్ల నిర్వహణ, చిన్న చిన్న పంక్షన్ల కోసం వినియోగిస్తారు. అయితే నిధుల లేకపోవడంతో హెచ్ఎంలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

యుటిలైజేషన్ సర్టిఫికెట్స్ ఎవరు ఇస్తారు..

ప్రభుత్వం నుంచి విడుదల అయ్యే నిధులకు సంవత్సరం చివరలో ప్రతిశాఖ యూసీలు (యుటిలైజేషన్ సర్టిఫికెట్స్) ఇవ్వడం సర్వసాధారణం. అయితే గత ప్రభుత్వం కేంద్రం నుంచి తీసుకున్న నిధులు ఎలా ఖర్చు చేశారో జిల్లా స్థాయిలో అధికారులకు కూడా తెలియని దుస్థితి. ఇప్పుడు యూసీలు ఎక్కడ నుంచి తీసుకురావాలి, ఎవరు ఇస్తారు అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. గతంలో కేంద్రం మంజూరు చేసిన నిధులకు యూసీలు ఇవ్వని కారణంగానే ఇప్పటి వరకు స్కూల్ గ్రాంట్ మంజూరు కాలేదని హెచ్ఎంలు చెబుతున్నారు. ఈ సమస్యను అధిగమించి సత్వరం నిధులు ఇవ్వకుంటే పాఠశాల నిర్వహణ మరింత భారం అయ్యే పరిస్థితి నెలకొంది.

భారం.. భరించలేం!

- యాప్‌ల నిర్వహణతో అంగన్‌వాడీలు లబోదిబో
- నాలుగు యాప్‌లు సహా 15 రికార్డుల నిర్వహణ
- మావల్ల కాదంటూ ఆందోళన దిశగా అడుగులు

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ఉద్యోగులకు పనిభారం పెరుగుతూనే ఉంది. చాలీచాలని వేతనాలతో ఉద్యోగాలు చేసే వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోయలేని భారం వేస్తున్నాయి. రెండు ప్రభుత్వాల విధుల భారం మోయలేక మహిళా ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. తమపై భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. స్త్రీ, శిశు సంక్షేమంలో అంగన్‌వాడీలు పాత్ర అత్యంత కీలకం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 3 లక్షల మంది గర్భిణులు, బాలింతలు, లక్షన్నర మంది చిన్నారులకు పోషణ అందించడంతోపాటు, వారి సంక్షేమం విషయంలో అంగన్‌వాడీ ఉద్యోగులు ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. మూడు జిల్లాల్లో 5 వేల అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అయితే అంగన్‌వాడీల్లో స్త్రీ, శిశు సంక్షేమానికి సంబంధించిన విధులు ప్రభుత్వ విధానాల కారణంగా దెబ్బతింటున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు బలవర్ధక ఆహారాన్ని అందించడంతోపాటు, చిన్నారులకు ప్రీ స్కూలు విద్యను కూడా వీరు అందించాల్సి ఉంటుంది.

విధిగా ఆన్‌లైన్..

అంగన్‌వాడీ కార్యకర్తలు విధిగా నాలుగు ఆన్‌లైన్ యాప్‌లను నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోషణ ట్రాకర్లో ప్రతి రోజూ చిన్నారులు, గర్భిణులు, బాలింతల పోషణ వివరాలు నమోదు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన బాల సంజీవని యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందించే పోషణ వివరాలు నమోదు చేయాలి. వీటితోపాటు రెండు యాప్‌లలో ప్రతి రోజూ టాయిలెట్ ఫొటో తీసి అప్లోడ్ చేయాలి. ప్రీస్కూలు నిర్వహించి ఆ ఫొటోలు అప్లోడ్ చేయాలి. వీటితోపాటు నెలకు రెండుసార్లు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు చేయాలి. నెలకు ఒకసారి మిల్క్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి.

రికార్డుల మోత

ఒక్కో అంగన్‌వాడీ ఉద్యోగి 15 రికార్డులు నమోదు చేయాలి. ఫుడ్ కంజంప్షన్ రికార్డు(ఎఫ్‌సీఆర్), పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే అనుబంధ పోషణ రికార్డు (ఎస్ఎన్‌పీ), ప్రీస్కూల్ అటెండెన్స్ రికార్డు, గర్భిణులు, బాలింతల రికార్డులు ప్రతి రోజూ నమోదు చేయాలి. వీటితోపాటు టీకా రికార్డు, విటమిన్ ఏ రికార్డు, రిఫరల్ సర్వీసెస్, గృహ సందర్శనలు రికార్డు చేయాలి. మంత్లీ ప్రాజెక్టు రిపోర్టు(ఎంపీఆర్), అంగన్‌వాడీ పరిధిలోని హౌస్‌హోల్డ్ సర్వే, గ్రోత్ రికార్డు, గ్రోత్ చార్టు నిర్వహణతోపాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రెండు టేక్ హోమ్ రేషన్(టీహెచ్ఆర్)ల సంతకాల రిజిస్టర్, స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్ సహా 15 రికార్డులను మోయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

విజిలెన్స్‌లో బదిలీల కుదుపు

- ఒకే రోజు ఐదుగురు అధికారులను మార్చిన డీజీపీ

గుంటూరు సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయంలో భారీ ఎత్తున బదిలీలు జరిగాయి. సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న అధికారులకు స్థానచలనం కలిగింది. ఒకే రోజు ఐదుగురు కీలక అధికారులను మాతృశాఖకు పంపిస్తూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేయడం కలకలం రేపింది. సోమవారం సాయంత్రం వెలువడిన ఉత్తర్వులు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. డీఈఈ కె. విజయ వీరకుమార్, సీఐ శీలం శ్రీనివాస రెడ్డి, వ్యవసాయాధికారి ఖడ్గం రమణకుమార్, ఎస్ఐ రామచంద్రయ్య, సీనియర్ అసిస్టెంట్ కె.మల్లికార్జున రెడ్డిని విజిలెన్స్ నుంచి బదిలీ చేశారు. వెంటనే మాతృ శాఖకు వెళ్లి పోవాలని ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు ప్రస్తుతం చాలా కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో పలు కీలకమైన కేసులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరుపుతుంది. అధికారుల బదిలీ వ్యవహారం ముందే ఊహించినదే అయినప్పటికీ అతి తక్కువ సమయంలోనే అందరూ వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది.

అందరూ కొత్త వారే..

ప్రభుత్వం మారిన తర్వాత విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఊహించని రీతిలో బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సూర్య శ్రావణ్ కుమార్‌ను ఎస్పీగా నియమించారు. ఆ తర్వాత సీఐ శ్రీహరిని నెల్లూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సీఐ కొమ్మలపాటి చంద్రశేఖర్‌ను నియమించారు. తాజాగా బదిలీ అయిన ఎస్ శ్రీనివాసరెడ్డి స్థానంలో పి.శివాజీని నియమించారు. అగ్రికల్చర్ ఆఫీసర్‌ని కూడా రేపో మాపో నియమిస్తారని తెలిసింది. ఏవో పోస్టు కోసం కొందరు కీలక ఎమ్మెల్యేలు సిఫార్సు చేసినట్లు తెలిసింది. విజిలెన్స్ కార్యాలయంలో ఇప్పటికే చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిల్లోకి వచ్చేందుకు చాలా మంది తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అత్యంత కీలకమైన డీఈఈ పోస్టులో ఒక అధికారిని నియమించేందుకు సీనియర్ ఎమ్మెల్యే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

గ్రేడ్-5 కార్యదర్శుల జీతాల సమస్యకు పరిష్కారం

- ఆంధ్రజ్యోతి కథనంతో అధికారుల్లో స్పందన
- కేడర్ స్ట్రెన్త్ సమస్యతో ఉద్యోగులకు కష్టాలు
- ఐదారు నెలలుగా జీతాలు రాక అగచాట్లు

గుంటూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఐదారు నెలలుగా జీతాలు రాక అగచాట్లు పడుతున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల గోడు ఎట్టకేలకు ప్రభుత్వానికి వినిపించింది. ఐదారు నెలలుగా ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా అధికారుల దృష్టికి చేరకపోవడంతో వారు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'జీతాల పంచాయతీ' పేరుతో కథనం వెలువడింది. దీంతో సమస్య ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లింది. జిల్లా పంచాయతీ అధికారులు, సీఈవోల నిర్వాకంతోనే గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు ఐదారు నెలలుగా జీతాలు అందడం లేదని పంచాయతీరాజ్ కమిషనరేట్ గుర్తించింది. తక్షణమే చర్యలకు ఉపక్రమించింది.

సమస్య పరిష్కారానికి చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అమలులోకి తెచ్చిన 'ఒక పంచాయతీ-ఒక కార్యదర్శి' విధానం కారణంగా గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులకు కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎంపీడీవో లాగిన్లోని క్యాడర్ స్ట్రెన్త్ సమస్య కారణంగా ఐదారు నెలలుగా ఉద్యోగులకు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. క్యాడర్ స్ట్రెన్త్‌ను తప్పుగా నమోదు చేసిన ఎంపీడీవోలు, సరిచేయాల్సిన జిల్లా పంచాయతీ అధికారులు వాటిని పట్టించుకోకపోవడంతో ఉద్యోగుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. క్షేత్రస్థాయిలోని ఈ సమస్య ఎంపీడీవోలు, డీపీవోలు అడ్డుపడడంతో ప్రభుత్వం దృష్టికి వెళ్లలేదు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం ప్రభుత్వ పెద్దల దృష్టిలో పడడంతో పంచాయతీరాజ్ కమిషనరేట్ ఈ అంశంపై ఆరా తీసింది. ఉద్యోగుల క్యాడర్ స్ట్రెన్త్ వివరాలతో రాష్ట్ర ఖజానా కార్యాలయంలో అప్‌డేట్ చేయించాలని డీపీవోలు, సీఈవోలకు పంచాయతీరాజ్ కమిషనర్ ఆదివారం షెడ్యూల్ విడుదల చేశారు. పూర్తి స్థాయిలో వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

నామినేటెడ్ పదవిని విశ్వబ్రాహ్మణులకు కేటాయించేలా చట్టం చేయాలి



మాట్లాడుతున్న పావులూరి హనుమంతురావు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి హిందూ దేవాలయాల్లో ఒక నామినేటెడ్ పదవిని విశ్వబ్రాహ్మణులకు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం అరండల్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం జరగనున్న రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ సమావేశంలో రాష్ట్రంలో ప్రతి దేవాలయంలో బ్రాహ్మణులకు రెండు నామినేటెడ్ పోస్టులు కేటాయించేలా చట్టం చేయాలని మంత్రి వర్గం తీర్మానం చేస్తున్న నేపథ్యంలో విశ్వబ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. దేవాలయ నిర్మాణ కర్త స్థాపతి, దేవాలయ నిర్మాణంలో భాగస్వాములైన విశ్వబ్రాహ్మణులను విస్మరించడం తగదని అన్నారు. విశ్వబ్రాహ్మణులను విస్మరించిన కారణంగా జగన్ ప్రభుత్వం ఓడిందని అన్నారు. నూతన కూటమి ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘ సభ్యులు అంగలకుదురు సుశీల, కొలగాని నంద వీర ప్రసాదు, కిరణ్, బ్రహ్మముడి కోటేశ్వరరావు, అత్తలూరు వీర బ్రహ్మచార్యులు, కదిరి ఈశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 32,625 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువున ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 38,031 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 45 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 32,625 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 5,406 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. వాతావరణ శాఖ అధికారులు అందించిన వివరాల మేరకు రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. పొంగే వాగులు, కాల్వలు, రోడ్లులు, కల్వర్టులు, మ్యాన్‌హోల్స్‌కు ప్రజలు దూరంగా ఉండాలని చెప్పారు. భారీ వర్షాల సమయంలో పిడుగులు పడే అవకాశం ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ వద్ద ఉండరాదని, ప్రజలు జాగ్రత్త వహించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులైన ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.


గ్రామ పంచాయతీలకు మహర్దశ



డాక్టర్ జాస్తి వీరాంజనేయులు

గుంటూరు సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో ని గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలకు మహర్దశ పట్టిందని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తెలిపారు. సోమవారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం 2024 -25 తొలి విడత కేంద్ర నిధులు రూ.988 కోట్లు విడుదలయ్యాయని, అవి త్వరలో రాష్ట్రంలో ని గ్రామ పంచాయతీలు, జిల్లా పరిషత్‌ల ఖాతాలలో జమ అవుతాయని తెలిపారు. అక్టోబరు 14 నుంచి 21 వరకు ప్రభుత్వం పల్లె పండగ పేరుతో వారం రోజుల పాటు కార్యక్రమాలు చేపట్టనుందని తెలిపారు. ఆగస్టు నెలలో రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పంచాయతీలలో గ్రామ సభలు పెట్టి గ్రామాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన పనులపై తీర్మానాలు చేశారని, ఆ పనులు ఇప్పుడు చేపడతారని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలన కునారిల్లిన గ్రామ పంచాయతీలు ఇప్పుడు నూతన శోభను సంతరించుకుంటాయని అన్నారు.

అండర్-25 క్రికెట్ జట్టులో రాహుల్‌కు స్థానం



పవన్ సాయి రాహుల్

మంగళగిరి సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-25 పురుషుల జట్టులో పాతమంగళగిరి జీఆర్ స్కూల్ ప్రాంతానికి చెందిన కడియం పవన్ సాయి రాహుల్ ఎంపికయ్యాడు. ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబు సోమవారం ఎంపికైన జట్టు వివరాలను ప్రకటించారు. బెంగళూరు వేదికగా ఈ నెల 17వ తేదీ నుంచి పి.రామచంద్రరావు ట్రోఫీ అండర్-25 మల్టీడే మ్యాచ్‌లు ఆరంభం కానున్నాయి. మంగళగిరి నుంచి ఏసీఏ జట్టుకు ఎంపికైన తొలి క్రికెటర్ రాహుల్ కావడం విశేషం. అండర్-25 జట్టుకు ఎంపికైన రాహుల్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు.

అరుణాచలంకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ స్పెషల్ హైటెక్ 2+2 పుష్ బ్యాక్ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 15న రాత్రి 9.45 గంటలకు బయల్దేరి 16వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 17న పౌర్ణమి రోజున అరుణాచలంకు చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం బయల్దేరి 18వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోచార్జి రూ.2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382825420 సంప్రదించాలని కోరారు.

గుంటూరు-1 డిపో నుంచి ఒక సర్వీసు..

ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 15న రాత్రి 9.45 గంటలకు బయల్దేరి 16వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 17న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం బయల్దేరి 18వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96779 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు డిపో మేనేజర్ రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఐసీఐసీఐ బ్యాంకులో సీఐడీ తనిఖీలు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట బ్యాంక్ వీధిలో ఉన్న ఐసీఐసీఐ బ్యాంకులో సోమవారం గుంటూరు జిల్లా సీఐడీ అదనపు ఎస్పీ సీహెచ్ ఆదినారాయణ ఆధ్వర్యంలో సీఐడీ బృందం తనిఖీలు నిర్వహించింది. బాధితుల వద్ద నుంచి వాంగ్మూలాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసరావుపేటలో ప్రస్తుతానికి ఏడుగురు బాధితులు ఉన్నట్లు తేలిందన్నారు. వీరి సంఖ్య ఇంకా పెరగవచ్చు అన్నారు. ఇప్పటి వరకు నరసరావుపేట, చిలకలూరిపేట, విజయవాడలో మొత్తం 72 మంది బ్యాంకు బాధితులు ఉన్నారని ఆయన చెప్పారు. నరసరావుపేటలో 7, చిలకలూరిపేటలో 60, విజయవాడలో 5 మంది బాధితులు ఉన్నారని చెప్పారు. బాధితులకు మొత్తం రూ. 28 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లు గమనించామన్నారు. నరసరావుపేటలో ఐదుగురు బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు చెప్పారు. బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే గుంటూరు జిల్లా సీఐడీ కార్యాలయంలో సంప్రదించి వివరాలు తెలియజేయవచ్చునారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 31,040 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 36,868 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. దీనిలో పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు కృష్ణా నదికి వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

21,793 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 24,413 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 21,793 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 20,808 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	16000	334	8500	15200
నెంబరు. 5	10000	15500	నెంబరు. 5	12000	16500
273	--	--	273	12000	12500
341	9000	14500	341	9500	13500
4884	12500	15000	4884	10000	14000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	18600	తేజ	11000	18600
బ్యాడిగి	9000	15500	బ్యాడిగి	10000	14200
దేవనూరు డీలక్స్	9500	16000	దేవనూరు డీలక్స్	10500	15500
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	11000

శ్రీమద్భగవద్గీత దశమ అధ్యాయంపై ప్రవచనం

గుంటూరు తూర్పు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్న మయ్య కళావేదికపై సోమవారం సువీరానంద స్వామి, చిన్మయ మిషన్ వారిచే శ్రీమద్భగ వద్గీత దశమ అధ్యాయం లోని విభూతియోగ జ్ఞానయజ్ఞం ప్రవచ నాలు ప్రారంభ మయ్యాయి. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సువీరా నందస్వామి ప్రవచిస్తూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునితో తన లీలావతార విశేషాలను దేవతలుగాని, మహర్షులు గాని తెలుసుకోలేరని చెప్పాడని అన్నారు. కార్యక్రమానికి బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యం అందించారు.



ప్రవచనం చేస్తున్న సువీరానందస్వామి

ఆకట్టుకున్న మల్లాది సూరిబాబు గాత్ర కచేరి

గుంటూరు తూర్పు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం 46వ వార్షికోత్సవ సభ వాగ్గేయకారుల సంగీత మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలకు సంఘ కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ అధ్యక్షత వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ త్యాగ రాజస్వామి కళావేదికపై ప్రముఖ విద్వాంసుడు మల్లాది సూరిబాబు వాగ్గేయకార రచనలను శ్రావ్యంగా గానం చేసి సంగీతాభిమానులను అలరించారు. వీరికి వయోలిన్‌పై ఎ.కామాక్షి, మృదంగంపై బుర్ర శ్రీరామ్ చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. సంఘ ఉపాధ్యక్షుడు ఎస్ గిరిజా శంకర్ ఆధ్వర్యంలో కళాకారులను సత్కరించారు. వై.రాజ్యలక్ష్మి, ఫణితేజ కార్యనిర్వహణ సహకారాన్ని అందించారు.



గాత్ర కచేరి చేస్తున్న మల్లాది సూరిబాబు

అన్నదాతల్లో మళ్లీ వణుకు

- అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షం
- పత్తి కి అపార నష్టం ● వరికి మళ్ళీ అగ్నిపరీక్ష
- ఎక్కువ వర్షపాతం నమోదైతేనే ఇబ్బంది: డీఏఓ

గుంటూరు సిటీ,(ఆంధ్రజ్యోతి),అక్టోబర్ 14 : గుంటూరు జిల్లా రైతుల వెన్నులో మళ్ళీ వణుకు మొదలైంది. అల్పపీడన ప్రభావంతో సోమవారం ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు రోజుల పాటు భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తాయిని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో దిక్కుతోచనిస్థితి ఏర్పడింది. ఉదయం నుండి రాత్రి వరకు ఆగకుండా వాన కురుస్తున్నప్పటికీ వర్షపాతం మాత్రం చాలా తక్కువగా నమోదైనట్లు వ్యవసాయ శాఖ చెబుతోంది. అతి తక్కువ వర్షపాతంతో మరో రెండు రోజులు వర్షాలు కురిసినా పంటలకు పెద్ద నష్టం వాటిల్లదని వ్యవసాయ శాఖ చెబుతున్నా పత్తి,వరి రైతులు మాత్రం దిగులు చెందుతున్నారు. జిల్లాలో సుమారు 18 వేల హెక్టార్లలో పత్తి సాగుచేశారు. ఎక్కువ భాగం లేత మీద ఉండటంతో పెద్దగా నష్టం వాటిల్లదని అంటున్నారు. ఎక్కడైతే ముదురు పత్తి పంట ఉంటుందో వారికి నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు. ముదురు పత్తి బాగా పగిలి పంట చేతికి వచ్చే తరుణంలో ఆగకుండా కురుస్తున్న వర్షం వల్ల నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు. పత్తికాయలు వానకు నాని రాలిపోయే అవకాశం ఉందని అంటున్నారు. వరి 60 వేల హెక్టార్లలో సాగుచేశారు. ఆగస్టు చివరి రోజు కురిసిన వానకే వరి రైతులు బాగా నష్టపోయారు. ఆ దెబ్బ నుండి కోలుకోక ముందే మళ్ళీ వచ్చిన అల్పపీడనం ఏమి చేస్తుందోనన్న ఆందోళన రైతుల్లో కనిపిస్తోంది. తక్కువ వర్షపాతం నమోదై ఎన్నిరోజులు వాన కురిసినా నష్టం వాటిల్లదు కానీ మించి కుర్సేనే ఇబ్బంది అని రైతులు చెబుతున్నారు.

మొదలైన మిరప నాట్లు

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న వర్షాలకు మిరప నాట్లు ఊపందుకున్నాయి.వాస్తవానికి ఏ యేడాది ఖరీఫ్ లో 20 వేల హెక్టార్లలో మిరప పంట సాగు కావాల్సి ఉంది. అయితే, ఖరీఫ్‌లో కేవలం 4998 హెక్టార్లలో మాత్రమే పంట సాగు అయింది. ఖరీఫ్ ముగిసిన తరువాత జిల్లాలో మిరప సాగు ఊపందుకుంది. ప్రస్తుతం కురుస్తున్న వానలోనే చాలా చోట్ల మిరప సాగు చేస్తున్నారు. ఈ వానలో మిరప మొక్కలు నాటితే వాటికి తిరుగుండదని రైతులు చెబుతున్నారు. పెదనందిపాడు తదితర ప్రాంతాల్లో పొగాకు కూడా సాగు మొదలు పెట్టారు.

రైతులు ఆందోళన చెందవద్దు

- జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల జిల్లా రైతులకు పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కురిసిన వాన వల్ల పంటలకు నష్టం జరగకపోవచ్చునని అన్నారు. ఎడతెరిపి లేకుండా వాన కురిసి,ఎక్కువ వర్షపాతం నమోదైతేనే నష్టం జరుగుతుందని అన్నారు. అయితే రైతులు డ్రైనేజీ వ్యవస్థను బాగు చేసుకోని అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు ఏ అవసరం వచ్చినా సహకరించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందన్నారు.



పత్తి చేలులో నిలిచిన వర్షపు నీరు





అర్జీదారులతో మాట్లాడుతున్న డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవో శ్రీనివాసరావు తదితరులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 80 అర్జీలు

- అర్జీలు పరిష్కరించాలని అధికారులకు డీఆర్వో, ఆర్డీవో ఆదేశాలు

గుంటూరు తూర్పు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కలక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 80 అర్జీలు వచ్చాయి. కలెక్టర్, జేసీ అందుబాటులో లేకపోవడంతో అర్జీలను డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవో శ్రీనివాసరావు, డిప్యూటి కలెక్టర్ లక్ష్మీకుమారి, సమగ్ర శిక్ష అడిషనల్ కో ఆర్డి నేటర్ విజయలక్ష్మి స్వీకరించారు. వర్షం కారణంగా అర్జీదారులు తక్కువ సంఖ్యలో వచ్చారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ నిర్ణీత గడువులోపు ఫిర్యాదులను పరిష్కరించి బీఎండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ పెండింగ్ కేసులపై అప్ర మత్తంగా ఉండాలని, ఆర్థిక అంశాలతో కూడిన 59, ఆర్థికేతర అంశాలపై 12 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటికి సంబంధించిన కౌంటర్ దాఖలుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్య క్రమంలో డీఎస్‌వో కోమలి, డీఈవో శైలజ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధు సూదనరావు, జిల్లా వ్యవ సాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, సీపీవో శేషశ్రీ పాల్గొన్నారు.

- పంచాయతీ స్థలం ఆక్రమించి సెల్‌ఫోన్ టవర్లకు అద్దెకు

పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడులో 40 సెంట్ల పంచాయతీ స్థలాన్ని వేలినేని శ్రీనివాసరావు అనే వ్యక్తి ఆక్రమించుకుని ప్రైవేటు కంపెనీలకు చెందిన సెల్‌ఫోన్ టవర్లుకు అద్దెకిచ్చాడని అదే గ్రామానికి చెందిన కిలారు రాజారమేష్, అప్పసాని చంద్రశేకర్ ఫిర్యాదు చేశారు. స్థలానికి ఏడాదికి రూ.6వేలు చెల్లించి, నెలకు రూ.80 వేలకు అద్దెకిచ్చుకున్నారని, దీంతో పంచాయతి ఆదాయం కోల్పోతోందని తెలిపారు. సదరు వ్యక్తి మాజీ ఎమ్మెల్యే కిలారు రోశయ్య అనుచరుడని చెప్పుకుంటున్నాడని, దీంతో ఆయనపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సెల్‌ఫోన్ టవర్లపై వచ్చే ఆదాయాన్ని పంచాయతీకే వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

- కౌలు పేరుతో ఆక్రమణ

కౌలు వ్యవసాయం పేరిట పొలాన్ని ఆక్రమించుకుని తనను వేధిస్తున్నారని వట్టిచెరుకూరు మండలంలోని వట్టిచెరుకూరుకి చెందిన వృద్ధుడు భీమినేని వెంకట్రావు అర్జీ అందజేశారు. గ్రామంలో 3.53 ఎకరాల పొలం ఉందని, దీనిని ఎం.శివనాగమల్లేశ్వరికి కౌలు కింద ఇచ్చానని తెలిపారు. మొదట్లో కౌలు ఇచ్చినప్పటికీ ఈ మధ్య కాలంలో ఆ పొలం తనదంటూ ఆమె కౌలు కూడా చెల్లించడంలేదని తెలిపారు. సర్వేయర్ల సహకారంతో డాక్యుమెంట్లలో తన పేరును తొలగించి ఆమె పేరును చేర్చిందని వివరించారు. దీనిపై స్థానిక ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, తగు న్యాయం చేయాలని కోరారు.

- బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ వివరాలు ఇవ్వడం లేదు

ఉద్యోగ కాలం, పదవీవిరమణ సందర్భంగా వచ్చిన రూ.36 లక్షల లావాదేవిల వివరాలు స్థానిక బ్యాంకు అధికారులు ఇవ్వడం లేదని పొన్నూరుకు చెందిన విశ్రాంత ఉద్యోగి ఎద్దు ఇశ్రాయేలు ఫిర్యాదు చేశారు. వీటితో పాటు బాండ్ల రూపంలో పొదుపు చేసుకున్నానని, వాటి వివరాలు కూడా చెప్పడం లేదని అన్నారు. దీనిపై ఉన్నతాధికారులను సంప్రదించగా 2023 నాటికి తన ఖాతాలో రూ.17లక్షల 30 వేలు ఉన్నాయని చెప్పారని, వడ్డీతో కలిపి దాదాపు రూ.40 లక్షల వరకు ఉండాలని, మిగిలిన డబ్బుల కోసం అడిగితే కేసులు పెడతామని బ్యాంకు సిబ్బంది బెదిరిస్తున్నారని వాపోయారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించి తనకు రావాల్సిన డబ్బు ఇప్పించి, సదురు బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

- 3 సెంట్ల స్థలం ఆక్రమించి కారు పార్కింగ్

గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో ఉన్న 3 సెంట్ల స్థలాన్ని కోరివి స్వాములు ఆక్రమించుకుని వేధిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన పరికల రత్నకుమారి ఫిర్యాదు చేశారు. 20 ఏళ్ల క్రితం ఈ స్థలాన్ని కొనుగోలు చేశానని, కానీ ఈ మధ్యనే ఆ స్థలం తమదేనని సదరు వ్యక్తి ఆక్రమించుకుని, కారు పార్కింగ్ చేసుకుంటున్నాడని తెలిపారు. దీనిపై పంచాయతి కార్యదర్శికి ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. స్థలాన్ని కొలత చేయడానికి అర్జీ పెట్టుకున్నా సిబ్బంది రావడం లేదని, ఉన్నాతాధికారులు స్పందించి తన స్థలాన్ని తనకు ఇప్పించాలని కోరారు.

- పిల్లలతో సహా ఇంటి నుంచి గెంటేశారు

తన భర్త, సోదరులు కలిసి ఇంటి నుంచి పిల్లలతో సహా బయటకు గెంటివేశారని స్థానిక బొంగరాలబీడుకు చెందిన గృహిణీ మల్లవరపు వెంకాయమ్మ ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్, ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఫిర్యాదు చేయడంతో సహించలేని వారు ఈ మధ్యనే తనపై, పిల్లలపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు.

పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలి

గుంటూరు, కార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజలు ఇస్తున్న ఆర్జీలను మరు సటి సోమవారానికి పరిష్కారం చేయాలని, జీఎంసీ పరిధి కాని, పరిష్కారం చేయడానికి వీలులేని వాటికి విభాగాధిపతి తగిన వివరాలతో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో సోమవారం పీజీ ఆర్ఎస్ నిర్వహించారు. 35 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 11, ఇంజినీరింగ్ విభాగం 8, రెవెన్యూ విభాగం 7, ప్రజారోగ్య విభాగం 5, అకౌంట్స్ విభాగంకి సం బంధించి 6, ఉపాసెల్ కి సంబంధించి ఒక ఫిర్యాదు అందిందని కమిషనర్ తెలిపారు.

స్వర్ణాంధ్ర - 2047పై పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - 2047 గురించి విద్యార్థుల ఆలోచనలు చాలా అద్భుతంగా ఉన్నాయని డీఆర్‌వో పెద్ది రోజా అన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి సూచికలను ఏర్పాటు చేసుకొని రూపొందించే స్వర్ణాంధ్ర - 2047 దార్శనిక ప్రణాళికలో భాగంగా జిల్లా విద్యా శాఖ ద్వారా విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వం పోటీలలో గెలిచిన విద్యార్థిని, విద్యార్థులకు సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌వో రోజా మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి శైలజ మాట్లాడుతూ జిల్లాలోని 18 మండలాల నుంచి వివిధ పాఠశాలల్లోని 89 మంది విద్యార్థిని, విద్యార్థులు వ్యాస రచన, వక్తృత్వం పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. ఒక్కో అంశం నుండి ముగ్గురిని విజేతలుగా ప్రకటించామన్నారు.

పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలు పంపిణీ

గుంటూరు, కార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నగర పాలక సంస్థలో పార్క్ విభాగంలో విధులు నిర్వహించే కార్మికులు తగిన రక్షణ పరికరాలు ధరించి విధులు నిర్వహించాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీని వాసులు తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జీఎంసీ పార్క్ విభాగాల్లో విధులు నిర్వహించే కార్మికులకు రక్షణ పరికరాలను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పార్క్ విభాగంలోని కార్మికులకు హ్యాండ్ గ్లౌజులు, లాంగ్ బూట్లు, రెయిన్ కోట్లు, హెల్మెట్లు వంటి రక్షణ పరికరాలను అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్ ఓబులేసు, డిప్యూటీ కమిష నర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, ఎంహెచ్ఓ డాక్టర్ రవి, ఏడిహెచ్ రామారావు పాల్గొన్నారు.

జీఎంసీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

గుంటూరు, కార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు భారీ వర్షాల ప్రభావంతో గుంటూరు నగరంలో ప్రజలు తమ ప్రాంతాల్లో సమస్యలను తెలియజేసేందుకు, ఫిర్యాదుల పరిష్కారానికి, సత్వర స్పందన కోసం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 0863-2345105 కంట్రోల్ రూమ్ (24 గంటలు) ఏర్పాటు చేశామని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో 3 షిఫ్టులుగా సిబ్బందిని కేటాయించామని, ప్రజల ఫిర్యాదులు, వాటి పరిష్కార చర్యలపై ఎస్.ఈ., సిఎంఓహెచ్, ఎంహెచ్‌ఓలు సమన్వయం చేసుకుంటారన్నారు. రోడ్లపై చెట్లు పడితే తొలగించేందుకు వీలుగా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఏడీహెచ్‌ని, తాగునీటి పంపింగ్ రిజర్వాయర్లలో విద్యుత్ సరఫరాకి ఇబ్బంది రాకుండా ముందస్తుగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఇంజీనీరింగ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌కు ఎంపికలు

గుంటూరు తూర్పు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి 19 వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే దక్షిణాది రాష్ట్రాల అథ్లెటిక్స్ పోటీలకు అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు సంఘం కార్యదర్శి జీవీ ఎస్ ప్రసాద్ తెలిపారు.

- ఎంపికైన క్రీడాకారుల వివరాలు

ఎస్కే రోషన్, ఎం కిషోర్, బి నాగవిహారిక, జి.భావన, ఎస్కే హమీద్, రూపులిక పాత్ర, ఎండీ ఆసియా, విశోభిత, పి వెంకట సాయి చేతన శ్రీ



సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ శివశిరీష, భరత్‌రెడ్డి తదితరులు

సిమ్స్‌లో చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్

గుంటూరు (విద్య), అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 14: స్థానిక కాకాని రోడ్డులోని సిమ్స్ ఫిజియోథెరపి కళాశాలలో సోమవారం చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ బి.శివ శిరీష పుట్టిన రోజు సందర్భంగా ఈ సంస్థలను ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ బి. భరత్‌రెడ్డి తెలిపారు. చిన్నపిల్లలకు అత్యవసరమైన వైద్యం ఇక్కడ అందిస్తామని తెలిపారు. చిన్న పిల్లలు ఎదుర్కొనే జన్యుపరమైన సమస్యలకు, ఇతర వ్యాధులకు ఇక్కడ వైద్యం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ రాంబాబు, ఫిజియోథెరపి లైఫ్ సైన్సెస్, నర్సింగ్, బీఈడీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇష్టమైతే ఇక్కడ ఉండండి..లేకపోతే వెళ్లిపోండి

- 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపడుతున్నాం
- విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించను
- జీఎంసీ ఉద్యోగుల పనితీరుపై కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : 'మీకు ఇష్టమైతే ఇక్కడ ఉండండి.. లేకపోతే వెళ్లిపోండి. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించేది లేదు. ఎంతటి వారినైనా చూస్తూ ఊరుకోను' అని నగరపాలక సంస్థ కమి షనర్ పులి శ్రీనివాసులు జీఎంసీ ఉద్యో గుల పని తీరుపై మండిపడ్డారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పై విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్యం అందించడానికి 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపడుతున్నామని, డ్రైవ్ పర్యవేక్షణకు శానిటరీ డివిజన్ల వారీగా సీనియర్ అధికారులకు పర్యవేక్షణ విధులు కేటాయించామని తెలిపారు. గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా మార్చుకోవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఇందులో భాగంగా నగరంలోని 22 శానిటరీ డివిజన్లకు సీనియర్ అధికారులను పారిశుధ్య పర్యవేక్షణకు విధులు కేటాయించామని తెలిపారు. అదనపు కమిషనర్, సిఎంఓహెచ్, ఎంహెచ్‌ఓల ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో సమగ్ర పారిశుధ్య పనులకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాలని, విధులు కేటాయించబడిన అధికారులు ప్రతి రోజు ఉదయం 5:30 గంటలకు జరిగే ప్రజారోగ్య కార్మికుల హాజరు మస్టర్ పరిశీలించాలన్నారు. తమకు కేటాయించిన ప్రాంతాల్లో పారిశుధ్యంతో పాటు త్రాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైన్ల ఆక్రమణలను గుర్తిస్తే తక్షణం తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే 3 నెలల కాలంలో పారిశుధ్యంలో విప్లవాత్మక మార్పులను తీసుకు రావడానికి ప్రతి ఒక్కరూ సమిష్టి కృషి చేయాలన్నారు. నగర ప్రధాన వీధుల్లో ట్రాఫిక్‌కి అంతరాయం కల్గిస్తున్న ఆవులను బుధవారం నుండి వెంగళాయ పాలెంలోని జీఎంసీ గోశాలకు తరలించి, రిజిస్టర్‌లో వాటి వివరాలు నమోదు చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులకు వినియోగించే వాహ నాలను కండీషన్‌లో ఉండేలా, కేటాయించిన ప్రాంతాలకు నిర్దేశిత సమయంలో వెళ్లేలా వెహికిల్ షెడ్ అధికారులు బాధ్యత తీసుకోవా లన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్ ఓబు లేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్ శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్.ఈ. నాగ మల్లేశ్వరరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, మేనేజర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



విభాగాధిపతుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, పక్కన ఏసీ, డీసీ

యూజీడి ఉన్న ప్రాంతాల్లో ఇబ్బంది లేకుండా చర్యలకు ఆదేశాలు

గుంటూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ ఉన్న ప్రాంతాల్లో ఓవర్ ఫ్లో కారణంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆనందపేట, గోరంట్ల ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజి లైన్లు, పారిశుధ్య పనులను ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి కమిషనర్ సోమవారం పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఆనందపేటలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి ఓవర్ ఫ్లో వలన మురుగు నిలిచిన ప్రాంతాలను పరిశీలించి, తక్షణం నీటిని బెయిల్ అవుట్ చేయాలని అధికారులను ఆదేశించారు. యూజీడీ లైన్లపై ఉండే మ్యాన్ హోల్స్‌ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటే ఓవర్ ఫ్లో సమస్య రాదని ఈ విషయమై ఏఈలు మరింత శ్రద్ధ చూపా లన్నారు. లీకులు ఏర్పడకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం ఇన్నర్ రింగ్‌రోడ్ లోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం, డ్రైన్ల పై స్థానికులు ఫిర్యాదు మేరకు అధికారులతో కలిసి పరిశీలించారు. బహుళ అంతస్తు నిర్మాణాలు చేసేవారు అవుట్ ఫాల్ డ్రైన్ లోకి కనెక్షన్ ఇచ్చేలా పట్టణ ప్రణాళిక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.



యూజీడీ మ్యాన్ హోల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి: ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అహర్నిశలు కృషి చేస్తున్న నగరపాలక సంస్థ పారి శుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని, వారి సేవలు వెలకట్టలేనివని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి కొనియాడారు. నగరంలోని 23వ డివిజన్ నగరంపాలెంలో ఆడిటర్ గోపికృష్ణ ఆధ్వర్యంలో మహిళా శానిటరీ సిబ్బందికి ఆమె దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతృత్వంతో ముందుకు వచ్చి కార్మికులకు దుస్తులు పంపిణి చేసిన ఆడిటర్ గోపికృష్ణ ప్రయత్నం అభినందనీయమని కొనియాడారు.



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

- సయ్యద్ షంషుద్దీన్‌కి నివాళి

23వ డివిజన్ రఘురామ్ నగర్(గోరీలదొడ్డి)కి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ షంషుద్దీన్ (షంషేర్) భౌతికయానికి ఎమ్మెల్యే మాధవి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరా మర్శించి, వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై జై భీమ్ కార్మిక సంక్షేమ సంఘం ఫిర్యాదు

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజ్యాంగ విరుద్ధమైన సనాతన ధర్మం గురించి మాట్లాడడం దేశద్రోహం, రాజ్య ద్రోహమే అవుతుందని జై భీమ్ కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షులు పిల్లి బాబురావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఐజి త్రిపా ఠికి, జిల్లా ఎస్పీ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేశారు. అనంతరం అరండల్ పేట పోలీస్ స్టేషన్ లోనూ ఫిర్యాదు ఇచ్చారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభి వృద్ధికి, ప్రజా సం క్షేమానికి కట్టుబడి పని చేస్తానని హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత సనాతన ధర్మం అనే విషయాన్ని పవన్ తలకెత్తుకున్నారని విమర్శించారు.

ఉద్యోగాల పేరిట రూ.20 లక్షల మోసం

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తమ కుమార్తెలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని తమ నుంచి రూ.20 లక్షలు తీసుకుని సాంబశివరావు, శిరీష దంపతులు తమను మోసం చేశారని చేబ్రోలు మం డలం శుద్దపల్లికి చెందిన అల్లంశెట్టి అరుణ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు తన పెద్ద కుమార్తె బీటెక్ పూర్తి చేయగా, రెండో కుమార్తె డిగ్రీ పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో గతంలో ఏటి అగ్రహారంలో తమ కుమార్తెలు చదువుకున్న విజన్ ఇండియా స్కూలు నిర్వాహకుడు సాంబశివరావు, తమ కుమార్తెలకు ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి తన వద్ద నుంచి రెండు దఫాలుగా రూ. 20 లక్షలు తీసుకున్నాడని అన్నారు. ఉద్యోగాలు రాకపోవడంతో తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వకుండా తమను బెదిరిస్తున్నారని వాపోయారు.

కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలంటూ టోకరా

తమకు ఉద్యోగాలు ఇప్పిస్తామని తమ నుంచి రూ.20 లక్షలు తీసుకొని తుళ్లూరి నారయ్య మోసం చేశారని నగరంలోని పాత గుంటూరు రెడ్ల బజారుకు చెందిన శంషాద్, అదేవిధంగా కాలేషా వలి, పెద కూరపాడుకు చెందిన మహబూబ్ బాషా ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నరసరావుపేటలోని మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు. తమకు బంధువైన నరసరావుపేటలో కార్ డ్రైవర్ గా పనిచేస్తున్న షేక్ సైదా ద్వారా తుళ్లూరు నారయ్య పరిచయమై ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేశాడన్నారు. నారయ్య గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో గతంలో పనిచేశాడని, ప్రస్తుతం పల్నాడు ప్రాంతంలో పనిచేస్తున్నాడని చెప్పి రూ.20లక్షలు తీసుకున్నా రన్నారు తమతో పాటు నరసరావు పేటకు చెందిన మరో ముగ్గురు వద్ద కూడా డబ్బు తీసుకున్నారన్నారు. ఆ మొత్తంలో 10 లక్షలు సైదా, మరో 10 లక్షలు నారయ్య తీసుకొని తమను మోసం చేశారన్నారు.

నాలుగేళ్లయినా చార్జిషీట్ లేదు

తన వదిన, ఆమె కుటుంబ సభ్యులు, నగరంపాలెం పోలీసుల వేధింపుల కారణంగా తన తల్లి నాలుగేళ్ల క్రితం మృతి చెం దిందని, ఇంతవరకు పోలీసులు ఆ కేసులో కోర్టులో చార్జిషీటు దాఖలు చేయలేదని ఆమె కుమారుడు అరుణ్ బాబ్జి సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆకులవారితోటకు చెందిన తన తల్లి ఉమాదేవి వ్యవసాయ శాఖలో అటెండర్ గా పని చేసేదని, తన అన్న బాజీ కిరణ్ కరోనా కారణంగా 2021 మే 8న చనిపోయారని తెలిపారు. తనకు అదే నెల 22న వివాహం జరగాల్సి ఉందన్నారు. అయితే తన సోద రుడు మృతి చెందడంతో ఆయన భార్య అంజనీకుమారి వారి బంధువులతో పాటు నగరం పాలెం పోలీసులు ఆస్తులు మొత్తం తమ పేరుతో రాయాలని అరుణకుమారి, ఆమె బంధువులు తన తల్లిపై ఒత్తిడి తెచ్చారన్నారు. నగరంపాలెం పోలీ సులు స్టేషన్‌కు పిలిపించి హెచ్చ రించారన్నారు వీట న్నింటి నేపథ్యంలో 2021 మే 22న తన తల్లి ఒంటిపై యాసిడ్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. తొలుత దీనిపై నగరంపాలెం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారని, ఇంతవరకు పోలీసులు ఆ కేసులో కోర్టులో చార్జిషీటు దాఖలు చేయలేదని ఫిర్యాదులో పేర్కొ న్నారు. అంతేగాక తన తల్లి మరణంతో తనకు కారుణ్య నియా మకం ఇస్తారేమోనని అనుమానంతో తనపై తప్పుడు వేధింపులకు బనాయించారని, దీని కారణంగా తనకు కారుణ్య నియామకం కూడా రాలేదని తెలిపారు.

మాజీ ఎంపీ నందిగం సురేష్, పీఏ బెదిరించారని ఫిర్యాదు

తన వద్ద అప్పుగా తీసుకున్న మొత్తం తిరిగీ ఇవ్వాలని అడిగినందుకు మాజీ ఎంపీ నందిగామ సురేష్, ఆయన పీఏ తనను బెదిరించారని లాలాపేటకు చెందిన శేఖర్ రెహమాన్ ఫిర్యాదు చేశారు రేపల్లెకు చెందిన ఆసిఫ్ సన్నీ అనే వ్యక్తి 2020లో తన వద్ద రూ.20 లక్షలు అప్పుగా తీసుకున్నాడన్నారు. ఈ విషయమై సురేష్ వద్దకు వెళితే ఆయన కూడా తమను బెదిరించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

● భారతదేశంలో విద్య, భాష వంటి కీలకమైన విషయాల్లో మన పద్ధతులు శాశ్వతంగా ఉంటాయి. కానీ ఇక్కడి వివాహ వ్యవస్థ చాలా పటిష్ఠంగా ఉంది. భార్యాభర్తల మధ్య కంటికి కనబడని బలమైన బంధం, పిల్లలనే బాధ్యతలు ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేశాయి. దీనిని మార్చడం కంటే ఇటువంటి వ్యవస్థలో ఇమిడిపోవడం ఉత్తమం.
- మాక్స్‌ముల్లర్


● భారత దేశాన్ని ఎవరూ ఏమీ చేయలేరు. దీనికి కారణం దేశానికి సరిహద్దులో సైనిక రక్షణ, దేశంలో బలమైన కుటుంబ వ్యవస్థ ఉండటమే. - మహాత్మాగాంధీ

పెద్దలు.. పెళ్ళిళ్ళు...



● సినీ భ్రమ నుంచి యువత బయటకు..

సినిమాల్లో ఎక్కువ శాతం ప్రేమకు సంబంధించినవే ఉంటున్నాయి. వీటిపై యువత ఎక్కువగా ఆకర్షితులవుతుంది. సినిమాల్లో మాదిరిగానే జీవితం ఉంటుందని భ్రమలో ఉంటారు. కానీ వాస్తవ జీవితంలో అవి ఏమీ కనబడవు. నిజానికి యుక్తవయస్సులో తమ జీవిత భాగస్వామిని, కుటుంబ జీవితాన్ని ఎంచుకునే శక్తి యువతకు ఉండదనే చెప్పాలి. కొంత మంది ఆకర్షణనే ప్రేమగా భావిస్తారు. ఆకర్షణ తగ్గగానే వారి మధ్య ఉన్న బంధం బలహీన మవుతుంది. దీంతో వారు విడిపోతున్నారు. ఎక్కువగా ఈ మధ్య ఇటువంటివే జరుగుతున్నాయి. అందుకే వీటిని చూస్తున్న యువత తమ ఆలోచనలను మార్చుకుందనే చెప్పాలి. అంతేగాక తల్లిదండ్రులను ఎదిరించి వారి మద్దతు లేకుండా పెళ్లి చేసుకున్న వారి ఇబ్బందులను కూడా చూస్తున్నారు. దీంతో ఎక్కువ మంది యువత పెద్దలు కుదిర్చిన వివాహాల వైపే మొగ్గుచూపుతున్నారు. ప్రేమ అయినా, కుదిర్చిన సంబంధాలు అయినా పెద్దల సమక్షంలో జరిగిన పెళ్లిళ్లు మాత్రమే బలంగా ఉంటాయి. అందుకే ప్రేమ జంటలు తల్లిదండ్రులను ఒప్పించుకున్న తర్వాతే వివాహం చేసుకోవాలని పెద్దలు చెబుతుంటారు.



● వివాహాలపై మారుతున్న యువత ధోరణి
● భాగస్వామి ఎంపికలో తల్లిదండ్రులదే తుది నిర్ణయం
● ప్రస్తుతం జరుగుతున్న వివాహాల్లో 93 శాతం అలాంటివే

● కులాంతరం అనేకంటే.. అత్యాచారమే మేలు

మిగిలిన వారికంటే కులాంతర, మతాంతర వివాహలు చేసుకున్న జంటలు ఎక్కువగా కష్టాలు పడుతుంటారు. వీరిని ఇరు కుటుంబాలు అంగీకరించవు. మరోవైపు జంటల తల్లిదండ్రులను కూడా బంధువులు దూరంగా పెడుతున్నారు. దీంతో వివాహం చేసుకున్న వారు, వారి తల్లిదండ్రులు జీవితాంతం అనేక అవమానలను అనిభవిస్తున్నారు. అందుకే ఇలాంటి జంటల మధ్య ఏదైనా సమస్య వస్తే తన కూతురు కులాంతర వివాహం చేసుకుంది అనే కంటే ఆత్యాచారానికి గురైంది అని కేసు పెట్టడానికి ముందుకు వస్తున్నారు అంటే వీటిపై పెద్దలు ఎంత వ్యతిరేఖంగా ఉన్నారో అర్థమతుంది. ఢిల్లీలోని 7 జిల్లా కోర్టులో నమోదైన 600 ఆత్యాచారం కేసుల్లో 460 కేసుల తీర్పులను పరిశీలిస్తే ఈ విషయం వాస్తవమేనని తేల్చారు. ఈ కేసుల్లో దాదాపు 40 శాతం సమ్మతి ఉన్న జంటలు పెట్టుకున్న కేసులేనని తేలింది. అంటే తమ పిల్లలు కులాంతర, మతాంతర వివాహలు చేసుకున్నారు అనేకంటే తమ కూతురు అత్యాచారం, అపహరణకు గురైందని కేసు పెట్టడంలో ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పడానికి తలిదండ్రులు సిద్ధపడుతున్నారు.

● దాడులతో రహస్యంగా

కులాంతర వివాహలు చేసుకున్న జంటల్లో ఎక్కువ మంది దాడులకు బయపడుతుంటారు. అందుకే ఇటువంటి వివాహలు చేసుకున్న వారు తమ వివరాలు ఎక్కడ బయటకు వస్తాయో అనే భయంతో పెళ్లి సర్టిఫికెట్ తీసుకోవడం లేదని రుక్మిణి చేసిన సర్వేలో తేలింది.

● కులానికే ప్రాధాన్యం..

యువత కూడా ప్రస్తుతం కులాంతర, మతాంతర వివాహలపై అనాసక్తి చూపుతున్నారు. వీటిపై పట్టింపు లేదని పైకి చెబుతున్నా గణాంకాలు మాత్రం వేరేలా ఉన్నాయి. 2015లో మ్యాట్రిమన్ల సైట్లలో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న 1000 మంది యువతలో సగం మంది కులం గురించి పట్టింపు లేదని చెబుతూనే పెళ్లి నాటికి అదే కులానికి చెందిన వారిని మాత్రమే ఎంచుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

గుంటూరు(తూర్పు), అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి) : రుగ్వేదాన్ని ఆంగ్లంలోకి అనువదించిన బ్రిటీష్ మేధావి మాక్స్‌ముల్లర్ 1856లో తన భార్యకు రాసిన ఉత్తరంలోని సారాంశ మైనా, స్వాతంత్ర్య పోరాట సమయంలో గాంధీ చేసిన పై వ్యాఖ్యలను చూస్తే మన దేశంలో వివాహ వ్యవస్థకు ఎంతటి విశిష్టత, ప్రాముఖ్యత ఉందో తెలుసుకోవచ్చు. ఆయా మతాలకు అనుగుణంగా వివాహం జరిగే విధానం మారవచ్చుకాని, ఆ తర్వాత వారి జీవన విధానంలో, కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్ళడంలో ఎటువంటి మార్పు ఉండదు. ఇది భారతీయులుగా మనం చేసుకున్న గొప్పతనం అనే కంటే వాటిని నిర్ణయించే పెద్దలదే అని చెప్పాలి. ఎందుకంటే పెళ్లికి సంబంధించి జరిగే ప్రతి తంతులో ఒకటికి పదిసార్లు ఆలోచించి పెద్దలు తీసుకునే నిర్ణయాలే వాటిని ఇంత బలోపేతం చేస్తాయి. అందుకే సాంకేతికంగా ఇంత అభివృద్ధి చెందినా వివాహలు మాత్రం పెద్దలు తీసుకునే నిర్ణయాలకు అనుగుణం గానే జరుగుతున్నాయి. ఇప్పుడు ఇదే విషయాన్ని సర్వేలు కూడా ధృవీకరిస్తున్నాయి. ఏ వయస్సులో పెళ్లి చేసుకోవాలి.. పిల్లలకు ఏమి కావాలి.. ఎటువంటి భాగస్వామి అయితే బాగుంటుంది అనే విషయాలపై తల్లిదండ్రులకు పూర్తి అవగాహన ఉంటుంది. అందుకు యువత పెళ్లి విషయాన్ని తల్లిదండ్రుల నిర్ణయానికే అప్పగిస్తున్నారు.

ఆధునిక పోకడలతో కేసులు

ప్రస్తుతం డేటింగ్, లివింగ్ టు గెదర్, లివింగ్ సెషన్, లివింగ్ సీజన్ అంటూ అనేక పాశ్చత్య పోకడలు మన జీవితాల్లోకి వచ్చాయి. పెళ్లే కాదు ఇద్దరు కలిసి ఉండటానికి ఇవి కూడా మార్గాలు అని చెప్పే ప్రయత్నం చేశాయి. కానీ ఇవి అవి అంతగా ముందుకు వెళ్లలేకపోయాయి. యువతను అంతగా ప్రభావితం చేయలేకపోయాయి. ఇటువంటి బంధాలు రోజులకే పరిమితం అవుతున్నాయి.

ఆకర్షణ తగ్గగానే ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. కొంత మంది అయితే కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కానీ వందల మంది మధ్యలో జరిగే వివాహ వ్యవస్థలో ఇటువంటివి ఏమి కనబడవు. ఏదైనా సమస్య వస్తే పరిష్కరించడానికి పెద్దలు ఎలాగూ ఉంటారు. కొన్ని కొత్తదనం తగ్గేలోపు పిల్లలు అనే బాధ్యత వస్తుంది.

అందుకే ఇటువంటి వివాహ బంధాలు నూరేళ్లు ఉంటున్నాయి. అందు కేనేమో ప్రస్తుత యువత ప్రేమ విషయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా.. పెళ్లి విషయాన్ని మాత్రం పెద్దలకే వదిలేస్తున్నారు.

బలం చేకూర్చిన సర్వే నివేదికలు

భారతీయ వివాహం, సహచర్యం, ప్రేమ, పెళ్లి వంటి అంశాలపై సీనియర్ పాత్రికేయురాలు రుక్మిణీ కలిమచ్చి తన బృందంతో 2018-2021 నుంచి 25 సంవత్సరాలు దాటిన 1లక్షా 60వేల మంది జంటలపై సర్వే చేసింది.

వీటిలో పెద్దలు కుదిర్చిన వివాహలే 93 శాతం ఉన్నాయని తేల్చింది. 5శాతం ప్రేమ వివాహలు, 2 శాతం పెద్దల అంగీకారంతో కుదిరిన ప్రేమ వివాహలు, ఇతర బంధాలు మరో 2శాతంగా ఉన్నట్టు ధృవీకరించారు. ఇదే బృందం 85 సంవత్సరాల వయస్సు కలిగిన దంపతుల నుంచి వివరాలు సేకరించగా వారిలో దాదాపు 95 శాతం పెద్దలు కుదిర్చిన వివాహలే ఉన్నాయి. అంటే తరాలు మారినా వివాహం విషయంలో తీసుకునే నిర్ణయాల్లో ఎటువంటి మార్పులేదనే వాస్తవాలు నివేదికలు ద్వారా స్పష్టమవుతున్నాయి.

మతాంతర వివాహలు అంతంతే

2014లో దాదాపు 70 వేల జంటలపై కుల, మతాంతర విషయాలపై ప్రత్యేక సర్వే నిర్వహించింది. వీరిలో పట్టణ ప్రాంతాల్లో 10శాతం కులాంతర, 5 శాతం మతాంతర వివాహలు మాత్రమే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వీరి సంఖ్య పెద్దగా కనబడ లేదు. ఆర్థిక పరమైన అసమానతలు ఉన్నా కొద్దిరోజుల తర్వాత తల్లిదండ్రులు వివాహలను అంగీకరిస్తున్నారు. కానీ కులాంతర, మతాంతర వివాహలు చేసుకున్న వారిని మాత్రం అంగీకరించడం లేదని, అంతేగాక బంధువులు ఇళ్లలో జరిగే కార్యక్రమాలకు దూరంగా ఉంచుతున్నారని ఇటువంటి వివాహలు చేసుకున్న వారు సర్వే బృందంతో పంచుకున్నారు.

ప్రేమ పెళ్లిళ్లు..

ప్రేమ వివాహంలో సంతోషంగా ఉన్న 3 శాతం జంటల్లో ఎక్కువ శాతం ఒకే వృత్తికి చెందిన వారు ఉండటం విశేషం. వీరిలో అధికంగా డాక్టర్లు ఉన్నారు. మిగిలిన వాటిలో బంధుత్వంలో కూడిన ప్రేమ వివాహలు, సన్నిహిత కుటుంబాల పిల్లల మధ్య జరిగేవి ఉంటున్నాయి. తక్కువ చదువుకున్న అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతులు సాన్నిహిత్యంగా ఉన్నారని సర్వేలో పేర్కొనడం మరో విశేషం.

● సంప్రదాయంగానే జరగాలి



ప్రేమ అయిన పెద్దలు కుదిర్చినదైనా ఆయా సంప్రదాయలకు అనుగుణంగా పెళ్లిళ్లు జరగాలి. అటువంటివే నిలబడతాయి. భారతీయ వివాహ వ్యవస్థ ప్రపంచ దేశాలకు ఆదర్శనీయంగా తీర్చిదిద్దబడింది. పిల్లలు కూడా తల్లిదండ్రులు అంగీకరించేలా ప్రయత్నం చేయాలేగాని ఎవరూ లేకుండా వివాహలు చేసుకోరాదు. పెద్దవారు కూడా పిల్లలు మనసెరిగి వారికి ఇష్టమైన వివాహలను అంగీకరించేలా ఉండాలి. అప్పుడే భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు రావు.

- కోటా నాగరాజుశర్మ, టీటీడీ వేదపండితులు, సామాజిక విశ్లేషకులు, గుంటూరు

● విభేదాలు.. కేసులు



చాలామంది ప్రేమజంటలు వెంట తెచ్చుకున్న డబ్బులు అయిపోగానే వారి మధ్య విభేధాలు మొదలవుతాయి. వెంటనే కేసులంటూ మాదగ్గరకి వస్తారు. తల్లిదండ్రుల వద్ద ఇబ్బందులు రాలేదని చెబుతారు. మేము కూడా కేసుల వరకు వెళ్ల కుండా కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగిస్తాం. అలాగే పెళ్లి చేయమని వచ్చే జంటలకు కూడా తల్లిదండ్రుల అంగీకారం ఉంటే మంచిదని సర్దిచెబుతాం. చాలామంది మొదట్లో వినరు. ఆ తర్వాత మీరు చెప్పిందే నిజమని అంటుంటారు.

- పల్లపు కృష్ణ, పీపీ, గుంటూరు జిల్లా కోర్టు

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 2 గంటల ఆలస్యం



- అప్పికట్ల వరకు వెనక్కు

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నెంబరు. 20702 తిరుపతి - వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణీకులను తీవ్ర అసౌకర్యానికి గురి చేసింది. సోమవారం మధ్యాహ్నం 3.15 గంటలకు తిరుపతిలో బయలుదేరిన ఈ రైలు రాత్రి 7.45 గంటలకు గుంటూరు రైల్వేస్టేషన్‌కు చేరుకొని 7.50కి సికింద్రాబాద్ బయలుదేరాల్సి ఉన్నది. అయితే మాచవరం - నిడుబ్రోలు రైల్వేస్టేషన్ల మధ్యన రైలుమార్గం కుంగిపోవడంతో రైలుని మాచవరంలో గంటకు పైగా నిలిపేశారు. అనంతరం అప్పికట్ల వరకు వెనక్కు మళ్లించి అప్‌లైన్‌లో తీసుకొచ్చారు. ఈ కారణంగా రాత్రి 9.40 గంటల సమయంలో గుంటూరు రైల్వేస్టేషన్‌కు చేరుకొన్నది. దాదాపుగా రెండు గంటల ఆలస్యం కావడంతో ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ రైలుకు గుంటూరు వరకు కేవలం అల్పాహారం మాత్రమే పంపిణీ చేస్తారు. అయితే రెండు గంటల ఆలస్యం కావడం వలన ఆహారం కోసం ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. ఈ రైలు రాత్రి 11.30 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకోవాల్సి ఉండగా 2 గంటల ఆలస్యం కారణంగా అర్థరాత్రి 1.30 గంటలకు చేరుకోవచ్చని రైల్వేవర్గాలు అంచనా వేశాయి. కాగా మంగళవారం వందేభారత్ సర్వీసు లేకపోవడం కొంతవరకు మంచిదైంది. ఒకవేళ ఉంటే మంగళవారం కూడా ఈ రైలు ఆలస్యంగా నడపాల్సి వచ్చేది.

టీవీ అండ్ ఫిలిం స్టడీస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదకాకాని, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో టీవీ అండ్ ఫిల్మ్ స్టడీస్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ జె మధుబాబు సోమవారం తెలిపారు. రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేషన్ విధానంలో ఈ కోర్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిలిం మేకింగ్‌లో ఆసక్తి ఉన్నవారు, సినిమా రంగంపై సమగ్ర అవగాహన పెంచుకోవాలనుకునే వారు దరఖాస్తులు చేసుకోవచ్చని వివరించారు. ఈ కోర్సులో డాక్యుమెంటరీ, ఆర్ట్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్షన్, క్రియేటివ్ లైటింగ్, ఎడిటింగ్, స్క్రీన్ రైటింగ్, స్టోరీ బోర్డ్, సినిమాటోగ్రఫీ, ఫిలిం గ్రామర్ వంటి సబ్జెక్టులను బోధిస్తామన్నారు. యూజీసీ ఆదేశాల మేరకు నూతన విద్యా విధానంలో బోధనతో పాటు 50 శాతం ప్రాక్టికల్స్ ఉంటాయన్నారు. ఈ కోర్సులో ప్రవేశాలు పొందేందుకు ఏదైనా డిగ్రీ కోర్స్ ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. కోర్సులో ప్రవేశాలకు, మరిన్ని వివరాలకు 9393110848 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని డాక్టర్ మధుబాబు సూచించారు.

భారీ వర్షాలకు విద్యుత్‌శాఖ కంట్రోల్ రూమ్

● టోల్ ఫ్రీ నెంబర్ 1912కు కూడా ఫోన్ చేయెచ్చు

గుంటూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : వాయుగుండం కారణంగా కుండ పోత వర్షాలకు జిల్లాలో విద్యుత్‌శాఖ ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌ఛార్జ్ ఎస్‌ఈ కేవీఎల్‌ఎన్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌పరమైన సమస్యలు, అంతరాయాలు వంటి ఫిర్యాదుల కోసం 9440817526 నెంబర్‌తో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అంతేగాక విద్యుత్ సమస్యలపై టోల్ ఫ్రీ నెంబరు 1912 కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో తడిచిన విద్యుత్‌స్థంభాలు తాకవద్దని, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద మంటలు లేదా శబ్ధాలు వచ్చినప్పుడు కంట్రోల్ రూమ్‌కు సమాచారం తెలియజేయాలని కోరారు. గృహాల్లో కూడా విద్యుత్ పరికరాలు వినియోగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఫోర్జరీ సంతకాలతో అగ్రివెంంట్ సృష్టించి బెదిరింపు

● అడిగినంత బ్రోకరేజి ఇవ్వలేదని మోసం

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తాను విక్రయించిన పొలానికి మీడియేటర్ గా వ్యవహరించిన వ్యక్తికి అడిగినంత బ్రోకరేజి ఇవ్వలేదనే కారణంగా తన పొలానికి ఫోర్జరీ సంతకాలతో తప్పుడు అగ్రిమెంట్లు సృష్టించి తనను బెదిరిస్తున్నాడని గోరంట్ల అన్నపూర్ణ నగర్‌కు చెందిన అల్లాడి ప్రసాదరావు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పొన్నెకల్లులోని ఐదు ఎకరాల భూమిని జూలై 10న 12.5 కోట్లకు విక్రయించేలా అగ్రిమెంటు కుదుర్చుకొని ఇందుకు గాను మూడు కోట్ల 50 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో మీడియేటర్‌గా ఉన్న వ్యక్తి ఎకరానికి రెండు లక్షలు చొప్పున బ్రోకరేజ్ ఇవ్వాలని అడగ్గా అంత ఇవ్వనని చెప్పినందుకు తన పొలానికి 2018లో తాను ఆయనకు కోటిన్నరకు విక్రయించేలా ఒప్పందం చేసుకున్నానని అందులో కోటి 25 లక్షలు తనకు ఇచ్చినట్లుగా తప్పుడు ఒప్పంద పత్రం సృష్టించి మోసపూరితంగా తనను బెదిరిస్తున్నాడని ప్రసాదరావు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని, తనకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు.

ఏపీ లాసెట్ 2024 నోటిఫికేషన్ విడుదల

పెదకాకాని, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ లాసెట్, పీజీ లాసెట్ 2024కు సంబంధించిన అడ్మిషన్స్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి సత్యనారాయణ తెలిపారు. ఏపీలోని న్యాయశాస్త్ర కళాశాలలో ఈ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రవేశాల కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కే గంగాధరరావు విడుదల చేశారని పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 20 వరకు వెబ్ కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ నమోదు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ద్వారా ఈ నెల 22 నుంచి 25 వరకు కళాశాలలను ఎంపిక చేసుకోవచ్చని, వెబ్ ఆప్షన్‌లో మార్పులు ఈ నెల 26న చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అలాగె స్పెషల్ కేటగిరీకి చెందిన అభ్యర్థులు ఈ నెల 19 న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ప్రవేశాల విభాగం వద్ద ఏపీ లాసెట్ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ నెల 28న అడ్మిషన్ల అలాట్ మెంట్ జరుగుతుందని తెలిపారు. ఆయా కళాశాలలో ప్రవేశం పొందిన అభ్యర్థులు ఈ నెల 29, 30 తేదీలలో హాజరు కావాలని సూచించారు.



లాసెట్ కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య కే గంగాధరరావు, ఆచార్య సత్యనారాయణ తదితరులు.

మద్యం లాటరీలో భార్యాభర్తల అదృష్టం

పెదకూరపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో సోమవారం పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు, పెదకూరపాడు ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో 20 మద్యం దుకాణాలకు లాటరీ లాటరీ నిర్వహించారు. ఈ లాటరీలో విజయవాడకు చెందిన యండ్రాతి శ్రీనివాసరావుకు ఐదు మద్యం దుకాణాల అదృష్టం వరించింది. పెదకూరపాడు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లోని 121, 123, 124, క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బెల్లంకొండ మండలంలో ఒకటి, క్రోసూరు మండలం ఒక మద్యం దుకాణాన్ని లాటరీలో శ్రీనివాసరావు గెలుచుకున్నారు. అమరావతిలో శ్రీనివాసరావు సతీమణి శివ కుమారి పేరుతో కూడా మరో మద్యం దుకాణం లాటరీలో వారి వశమైంది. నియోజక వర్గం మొత్తంలో 20 మద్యం దుకాణాలకు గాను ఆరు మద్యం దుకాణాలు ఒకే వ్యక్తి పేరుతో ఐదు, సతీమణి పేరుతో మరొకటి రావటంతో శ్రీనివాసరావు గొప్ప అదృష్ట వంతుడంటూ నియోజక వర్గ ప్రజలు పేర్కొంటున్నారు. సిండికేట్‌గా ఏర్పడి అధిక మొత్తంలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నా సిండికేట్లకు నిరాశే మిగిలింది.

వీవీఐటీలో పొట్టేల్ చిత్ర బృందం సందడి

పెదకాకాని, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న చిత్రం " పొట్టేల్" ఈ నెల 25వ తేదీన విడుదల కానుంది. ఈ చిత్రం ప్రచార కార్యక్రమంలో భాగంగా చిత్రబృందం హీరో యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్ల, నటుడు నోయల్, డైరెక్టర్ సాహిత్ వీవీఐటీ కళాశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా హీరో యువచంద్రకృష్ణ మాట్లడుతూ పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు పడే కష్టమే ఇతివృత్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామనీ, విద్యార్థులు ఈ చిత్రాన్ని తప్పకచూడాలని కోరారు. యువతను అలరించే అన్ని అంశాలను ఈ చిత్రంలో పొందుపరిచినట్లు తెలిపారు. వీవీఐటీ విద్యార్థి గాయత్రి తాను పెన్సిల్‌తో గీసిన చిత్రాన్ని హీరో, హీరోయిన్‌లకు అందించింది. అనంతరం విద్యార్థులతో కలసి గీతాలాపన, నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.



వీవీఐటీ విద్యార్థి గాయత్రిని అభినందిస్తున్న చిత్రం బృందం

పంచాయతీరాజ్ ఏఈగా రవీంద్రారెడ్డి

● ఏపీఎంగా సుజాత బాధ్యతల స్వీకారం


రవీంద్రారెడ్డి

కాకుమాను, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాకుమాను మండల పంచాయతీరాజ్ ఏఈగా రవీంద్రరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు స్పెషల్ ఏఈగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. అలాగే మండల ఏపీఎంగా సుజాత బాధ్యతలు స్వీకరించారు. ఫిరంగిపురంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో కాకుమానుకు వచ్చినట్లు ఎంపీడీవో కీర్తి తెలిపారు. అలాగే ఈవోపీఆర్డీగా రవిబాబు బాధ్యతలు స్వీకరించారు. దుగ్గిరాల నుంచి బదిలీల్లో భాగంగా కాకుమానుకు వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు ఎంపీడీవోని మర్యాదపూర్వంగా కలిశారు. మండలాభివృద్ధికి కృషి చేయాలని నూతన అధికారులకు ఆమె తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని డోలాస్‌నగర్ పరిధిలో 132 కెవి లైన్ కండక్టర్ మార్చేందుకు గాను డోలాస్ నగర్ ప్రకాష్‌నగర్, పరిధిలో మంగళవారం ఉదయం 7 గంటల వరకు సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ సురేష్ బాబు తెలిపారు. అలాగే మంగళగిరి మండలం నవులూరులోని ఇఎస్సార్ గార్డెన్స్, గోలి వారితోట, మక్కేవారిపేట, బాపనయ్య నగర్ నందు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు మరమ్మతులు, ట్రీ కటింగ్ నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని సురేష్‌బాబు విజ్ఞప్తి చేశారు.

జనసేనకి జేఎస్సాఆర్ రాజీనామా

మంగళగిరిసిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి జంజనం వెంకట సాంబశివరావు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు సోమవారం ప్రకటించారు. వ్యక్తిగత కారణాల దృష్ట్యా తన పదవితోపాటు జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు రాజీనామా లేఖను జనసేన పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాస రావుకు పంపినట్టు తెలిపారు.

4 షాపులకు 370 అప్లికేషన్లు

తుళ్లూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు మండలానికి కేటాయించిన 4 మద్యం దుకాణాలకు 370 టెండర్ అప్లికేషన్లు వేసినట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సోమవారం గుంటూరులో తీసిన లాటరీలో నాలుగు షాపులకు లోకల్ వారు టెండర్ దాఖలు చేసిన వారికి ఒక్క షాపు కూడా దక్కకపోవటం విశేషం. ఎల్లుండి నుంచి నూతన షాపులు ప్రారంభంకానున్నాయి.

మహిళలకు రెండు మద్యం దుకాణాలు

దుగ్గిరాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండలంలో మొత్తం 5 మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహించగా రెండింటిని మహిళలు దక్కించుకున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇద్దరు మహిళల పేరు మీద మద్యం దుకాణాలు టెండర్ లాటరీ ద్వారా లభించడం విశేషం. వీరిలో ఒకరు వడ్లపూడికి చెందిన రాయల నరసమ్మ కాగా మరొకరు ఖమ్మం జిల్లాకు చెందిన బీ. సరస్వతిగా అధికారులు వెల్లడించారు. మిగిలిన మూడు దుకాణాలు గూడూరు వెంకట్రావు, తేలుకుంట్ల చాణక్య, నరిసెట్టి శ్రీనివాసరావులు దక్కించుకున్నారు.

ఈవోపీఆర్డీగా రవికుమార్

ప్రత్తిపాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఈవోపీఆర్డీగా జీ రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన మోషే ఉద్యోగ విరమణ చేయటంతో కొంత కాలంగా నడింపాలెం కార్యదర్శి షేక్ ఖాజా ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. న్యూజెండ్ల ఈవోపీర్డీగా పనిచేస్తున్న జీ.రవికుమార్‌ను ప్రత్తిపాడుకు బదిలీ చేశారు.

మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు


సదస్సులో పాల్గొన్న సీనియర్ అడ్వకేట్ ఝాన్సీ

దుగ్గిరాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం రాజ్యాంగంలో ప్రత్యేక రూపొందించిన చట్టాలపై మహిళలందరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ అడ్వకేట్ ఝాన్సీ అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ కే చంద్రమోహన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో సీనియర్ అడ్వకేట్ ఝాన్సీ మాట్లాడుతూ గృహ హింస, అత్యాచారాల, వివాహేతర సంబంధాలు, సహజీవనం, బాలికలపై వేధింపులకు పాల్పడటం వంటి కేసులతో పాటు మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై బాధితులకు ఉచితంగా న్యాయ సహాయం అందించనున్నట్లు తెలిపారు. సీనియర్ రిసోర్స్‌పర్సన్ అమీనా రెహమాన్ మాట్లాడుతూ అన్యాయం జరిగినప్పుడు నిర్భయంగా నేరుగా ఫిర్యాదు చేయడానికి మహిళలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది షేక్ మహబూబ్ పలువురు మహిళలు పాల్గొన్నారు.

36 మందిపై బైండోవర్..


ఆర్డీవో కార్యాలయ ఆవరణలో గారపాడు, యామర్రు వాసులతో సీఐ రమానాయక్

వట్టిచెరుకూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గారపాడు ఎస్సీ కాలనీలో తరచూ ఘర్షణలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో సోమవారం గారపాడు, యామర్రు ఎస్సీ కాలనీ నాయకులను, అలాగే గ్రామస్తులు మొత్తం 36 మందిని సోమవారం ఆర్డీవో ముందట సీఐ రమానాయక్ బైండోవర్ చేశారు. గ్రామంలో ఎలాంటి చిన్న గొడవలు జరిగినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారిని సీఐ రమానాయక్ హెచ్చరించారు.

అడుగడుగునా గుంతలే

● అధ్వాన రహదారులతో అవస్థలు
● ప్రమాదాలు చవిచూస్తున్న వాహనదారులు
● చోద్యం చూస్తున్న అధికారులు

పెదనందిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - పర్చూరు రహదారిలో ఏబీపాలెం నుంచి చిలకలూరిపేట అడ్డరోడ్డు దాకా అడుగడుగునా గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మరమ్మతుల గురించి పట్టించుకున్న నాథుడే లేడు. దీంతో ఎక్కడ గుంతలు అక్కడే ఉండటంతో కొద్దిపాటి వర్షాలకే తటకాలను తలపిస్తున్నాయి. నీటిలో ఉన్న భారీ గుంతలు వాహనదారులకు అర్థం కాక ప్రమాదాలకు లోనవుతున్నారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మోకాళ్ల లోతు ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో వాహనాలు పడి మరమ్మతులకు గురవుతున్నాయని, దీనికి వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పక్కన సైడు కాలువల నిర్మాణాలు చేపట్టకపోవడం ఉన్న కాలువలపై బడ్డీ కొట్లు ఏర్పాటు చేసి ఆక్రమణలకు గురవడంతో కాలువల్లో పూడికపడి నీరు పారుదల లేక రోడ్లపైనే ప్రవహిస్తున్నాయని దీంతో పూర్తిగా రహదారులు ఛిద్రంగా మారాయని, అప్పుడే అధికారులు మరమ్మతులు చేపట్టి ఉండి ఉంటే భారీ గుంతలు ఏర్పడి ఉండేవి కావని ప్రజలు వాపోతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ రహదారులకు మహర్దశ.. సాకారమయ్యేనా అని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రహదారి కి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గుంతల్లో నిలిచిన వర్షపు నీరు


పాతబస్టాండ్ సెంటర్లో రోడ్లపై ఏర్పడిన భారీ గుంతలు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలను అభివృద్ధి చేయకుండా గాలికొదిలేయటంతో ఏఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. సోమవారం పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా తాడికొండ మండలంలో కంతేరు, పొన్నెకల్లు, దామరపల్లి, పణిదం గ్రామాల్లో సీసీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఐదేళ్ల పాటు వైసీపీ విధ్వంస పాలన కొనసాగిన తరువాత మళ్లీ మన పల్లెలు అభివృద్ధి బాట పడుతున్నాయన్నారు. గ్రామసభల్లో ఆమోదించిన 30 వేల పనులకు సంబంధించిన పనులు నేటి నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపారు. కంతేరు గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో సీసీ రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. పొన్నెకల్లు గ్రామంలో రూ.14 లక్షల వ్యయంతో, దామరపల్లి గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో పణిదరం గ్రామంలో రూ.9లక్షల వ్యయంతో, నిడుముక్కల గ్రామంలో రూ.6 లక్షల వ్యయంతో, మోతడక గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో, లచ్చన్నగుడిపూడి గ్రామంలో రూ.8లక్షల వ్యయంతో, ముక్కామల గ్రామంలో రూ.8 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మాణాలు చేస్తున్నట్లు తెలిపారు. రూ.75 లక్షల ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వాసిరెడ్డి జయరామయ్య, మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్న కుమార్, జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివ రామయ్య, అధికార ప్రతినిధి గుంటుపల్లి మధుసూదనరావు, ఎంపీటీసీ సభ్యులు తాటి తులసీరామ్, గుంటుపల్లి సాంబశివరావు, ఫణిదరం సర్పంచ్ బాల కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ శ్రీనివాసాచార్యులు, బండ్ల కోటేశ్వరరావు, ఎంపీడీవో సమతా వాణి, ఏపీవో కిరణ్మయి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బేతపూడి విజయ్‌శేఖర్, తదితరులు పాల్గొన్నారు.


కంతేరులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న శ్రావణ్‌కుమార్

పెదకొండూరు, వీర్లపాలెం, గొడవర్రు గ్రామాల్లో పల్లెపండుగ

దుగ్గిరాల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన పల్లెపండుగను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు మండలంలోని పెదకొండూరు, వీర్లపాలెం, గొడవర్రు గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపా. ధిహామీ పథకం కింద తొలిరోజు మూడుగ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాప న చేశారు. పెదకొండూరులో 31.32 లక్షలతో రెండు రోడ్లు, గొడవర్రులో రూ.35.74 లక్షలతో ఒక రోడ్డు నిర్మాణానికి, వీర్లపాలెంలో రూ.19.09 లక్షలతో ఒక రోడ్డు నిర్మాణానికి కార్యాచరణ ప్రక్రియ పూర్తిచేశారు. జిల్లా పంచాయతీ అధికారి సాయికు మార్, ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ టీ గోవర్ధన రావు, ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, సర్పంచులు మేదర సౌజన్య, విశ్వనాథపల్లి ఉమాదేవి, బొల్ల శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ కే నెహ్రూ, కార్య దర్శులు కే వెంకటేశ్వర్లు, శివశంకర్ పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పెదకొండూరులో పల్లెపండుగలో పాల్గొన్న ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్, డీపీవో సాయికుమార్, ఎంపీడీవో శ్రీనివాసరావు, కేసంనేని శ్రీఅనిత తదితరులు

ఉపాధి హామీ పథకం పని పవిత్రమైనది

● చేయి చేయి కలిపి గ్రామాన్ని అభివృద్ధి చేద్దాం
● పిలుపునిచ్చిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పని చాలా ఎంతో పవిత్రమైందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం, రావిపాటి వారిపాలెం, గనికపూడి గ్రామాలలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధిహామీ పథకం ద్వారా రూ.60 లక్షల నిధులతో నిర్మించే రహదారులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం పనులకు వెళ్లడానికి ఎవరూ నామోషి పడాల్సిన అవసరం లేదన్నారు. ఇది మన గ్రామ పనిగా బావించాలన్నారు. గ్రామాభివృద్ధికి నేను ఎప్పుడూ అండగా ఉంటానని ఆయన తెలిపారు. తిక్కిరెడ్డిపాలెంలో ఎమ్మెల్యే బూర్లకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. తొలుత చెరువు కట్టపై ఉన్న అన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శంకర్ జనసేన సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, టీడీపీ నేతలు మర్రి వెంకట శివ, గింజుపల్లి వెంకటేశ్వరరావు, శివరామప్రసాద్, సర్పంచ్ మాకినేని జగన్, ఎంపీటీసీ మధు తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ఉండవల్లిలో ముంబై పోలీసులు

● మూడు రోజులుగా విస్తృత తనిఖీలు
● పోలీసుల అదుపులో చీరల దొంగలు

తాడేపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ముంబైలో ఈ ఏడాది సెప్టెంబర్ 30న ఓ వస్త్ర దుకాణంలో భారీగా దుస్తులు చోరీ కావడంతో సదరు దుకాణ యజ మాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ముంబై పోలీసులు ఈ కేసు విష యంలో విచారణకు నడుం బిగించారు. వస్త్ర దుకాణాల్లో చోరీలు చేసేవారు ఎక్కువగా తాడేపల్లి ప్రాంతంలో ఉంటారని సమాచారం అందుకున్న పోలీసులు మూడు రోజుల క్రితం విజయవాడ, తాడేపల్లి ప్రాంతాలకు విచ్చేశారు. కొందరు వస్త్రవ్యాపారులు చీరల దొంగతనం చేసేవారితో మిలాకత్ అయి వారు చోరీ చేసి తెచ్చే దుస్తులు తక్కువ ధరకు కొనుగోలు చేసి వినియోగదారులకు ఎక్కువ ధరలకు అమ్ముతుంటారు. సెప్టెంబరులో జరిగిన చోరీలో సదరు ముంబై దుకాణంలో భారీగా చీరలు, ఇతర దుస్తులు చోరీకి గురికావడంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. పలువురు ముంబై పోలీసులు విజయవాడ, తాడేపల్లి ప్రాంతాలకు వచ్చి పలు వస్త్ర దుకాణాల్లో విడివిడిగా దుస్తులు కొనుగోలు చేశారు. చివరకు ఉండవల్లిలోని ఓ పేరులేని దుకాణంలో ముంబైలో చోరీకి గురైన చీరలు, ఇతర దుస్తులు కనిపించడంతో సదరు షాపు యజమాని యల్ శ్రీరాంప్రసాద్ అక్కడ పని చేసే టి గంగాధర్ అనే వారిని ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని తాడేపల్లి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. సదరు అనుమానితులను ట్రాన్సిట్ వారెంట్‌పై మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ముందు సోమవారం హాజరుపరిచి అనంతరం ముంబై తీసుకువెళ్లారు. కాగా చీరల దొంగతనంలో మహిళా దొంగల హస్తం... లేక మరెవరిదైనా హస్తం ఉందా అనే కోణంలో కూడా పోలీసులు విచారిస్తున్నారు.


అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

వైద్యసేవలను సద్వినియోగించుకోవాలి

మంగళగిరి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో పది రోజులపాటు జరుగనున్న ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ప్రజలు సద్విని యోగించుకోవాలని ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కే.శకుంతల కోరారు. శంకర నేత్రాలయ (చెన్నయ్), రాఘవరపు వసుంధర జ్ఞాపకార్థం ఆమె సోదరులు కొట్టి వాయునందనరావు, రామానుజరావు, రామ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వైద్యశిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతిరోజు ఉద యం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్యశిబిరం జరుగుతుందన్నారు. రోగుల కు కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, మందులు, కళ్ల జోళ్లు ఉచితంగా అందిస్తామన్నా రు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు కంటి శస్త్రచికిత్సలు జరుగుతాయని, శిబిరానికి వచ్చేవారు ఫోన్ నెంబరు, ఆధార్‌కార్డు జిరాక్సు వెంట తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మంగళగిరి అర్బన్ సీఐ డి.వినోద్‌కుమార్, ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున, నృసింహాలయ మాజీ ధర్మకర్త ఆలేటి నాగలక్ష్మీ, టీడీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మాజేటి సూర్య వేణుగోపాల కృష్ణ, నేతలు గోవాడ దుర్గారావు, వాకా మాధవరావు, జొన్నాదుల బాలకృష్ణ, తిరుమలశెట్టి హనుమంతరావు, పందేటి తిరుపతయ్య, వెంకట రామాంజనేయులు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ కమిషనర్ శకుంతల, సీఐ

ఎడతెరిపిలేని వర్షంతో అన్నదాతల అవస్థలు

పెదనందిపాడు, అక్టోబరు, 14 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో మండలంలో సోమవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లో నీరు నిలవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మరో రెండు రోజులపాటు వర్షాలు పడతాయని వాతావరణశాఖ తెలపడంతో చేతికొచ్చే పత్తి పంట పాడవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై నీరు నిలవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

● వాతావరణ శాఖ రానున్న 48 గంటలు అధిక వర్షాలు కురుస్తాయని తెలపడంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శంకరబాబు తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, లోతట్టు ప్రాంత వాసులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. అత్యవసరమైతే 9966331160 నెంబరు కాల్ చేయాలని తెలిపారు.

మండలంలో నేటి నుంచి పల్లె పండుగ

మేడికొండూరు అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు మేడికొండూరు మండల గ్రామాల్లో మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆయా గ్రామాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద చేపట్టనున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రారంభించనున్నారు. 15వ తేదీన మండలంలోని డోకిపర్రు గ్రామంలో 10లక్షలు, మంగళగిరిపాడులో 8లక్షలు, మేడికొండూరులో 15లక్షలు, వెలవర్తిపాడులో 6లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి, పనులను ప్రారంభించనున్నారు. కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారు. 19వ తేదీన కొర్రపాడులో 16లక్షలు, పాలడుగులో 10 లక్షలు, సిరిపురంలో 10లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టనున్నారు.

సీఎం చంద్రబాబుకు రూ.8లక్షల చెక్కు


వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబునాయుడుకు రూ.8లక్షల చెక్కును అందజేస్తున్న రైతు నేతలు, మహిళలు

తుళ్లూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం తుళ్లూరులో రైతులు, మహిళలు సేకరించిన 8 లక్షల రూపాయల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి సోమవారం అందజేశారు. తుళ్లూరులో రాజధానికి భూములు త్యాగం చేసిన రైతులు వరద బాధితుల సహాయార్థం పర్యటించి దుస్తులు పాత్రలు విరాళాలు ఇటీవల సేకరించి పంపించారు. నగదును సీఎం సహాయ నిధికి 8లక్షల చెక్కును వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును కలసి అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు జేఏసీ నేత కాటా అప్పారావు, జమ్ముల కిరణ్(బాబి), కొమ్మినేని రమేష్, మహిళా నేతలు కామినేని గోవిందమ్మ, కొల్లి అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంగళగిరి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రెండు, మూడు రోజులపాటు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో మంగళగిరిలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా సూచించారు. ప్రజల సహాయార్థం సెల్: 7093912653, ల్యాండ్: 08645-295193 టోల్‌ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న గోడలు, పాత భవనాలు, భారీ చెట్లు కూలే ప్రమాదం ఉందని, కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న దృష్ట్యా ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదకర పరిస్థితులు ఉన్నట్టయితే దగ్గర్లోని సచివాలయంలో కానీ, ఎంటీఎంసీ కార్యాలయంలో కానీ తెలియజేయాలని కోరారు.

చలపతి అధ్యాపకునికి డాక్టరేట్ ప్రదానం


తాటి రాఘవయ్య

తాడికొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మోతడక చలపతి ఇంజ నీరింగ్ కళాశాలలో మాథమాటిక్స్ అండ్ సాటిస్టిక్స్ విభాగంలో అసి స్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న తాటి రాఘవయ్యకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్టు కళా శాల ప్రిన్సిపాల్ కొల్లా నాగ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ ఎన్ విశ్వం పర్యవేక్షణలో ఆన్ డిఫరెంట్ ఎస్టిమేషన్ మెథడ్స్ ఆఫ్ పెరామీటర్స్ ఫర్ యా క్వాడ్రాటిక్ డిస్ట్రిబ్యూషన్ అనే అంశంపై పరిశోధనా పత్రం సమర్పించినట్లు తెలిపారు. డాక్టరేట్ సాధించిన రాఘవయ్యను కళాశాల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై సుజిత్‌కుమార్, కళాశాల డీన్ ఫణికు మార్, బాల మురళీకృష్ణ, వీవీ సుబ్బారావు, తులసీరాణి, శంకరావులు అభినందించారు.

పవర్ లిఫ్టింగ్ బెంచిప్రెస్ పోటీలకు ముగ్గురి ఎంపిక


ఎంపికైన పవర్ లిఫ్టర్లతో విజయ భాస్కరరావు, సంధాని

మంగళగిరి సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గోవాలో ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు జరుగనున్న జాతీయ స్థాయి పురుషులు, మహిళల బెంచిప్రెస్ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి ముగ్గురు లిఫ్టర్లు ఎంపికయ్యారని పవర్ లిఫ్టింగ్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సందాని తెలిపారు. పురుషుల జూనియర్ బెంచిప్రెస్ 74 కిలోల విభాగంలో రమేష్‌శర్మ, మహిళల మాస్టర్స్ 76 కిలోల విభాగంలో కాంత కుమారి, 69 కిలోల విభాగంలో జ్యోతివర్మ పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన లిఫ్టర్లకు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా వైస్‌ఛైర్మన్ ఆర్ఎస్ వంశీకృష్ణ, కోశాధికారి జీ వెంకటేశ్వరరా వు, ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్, బి.చంద్రిక, భాస్కర్, సంయుక్త కార్యదర్శులు సాయిరేవతి, మస్తాన్‌వలి అభినందనలు తెలియజేశారు.

కేఎల్‌యూ విద్యార్థినికి కాంస్య పతకాలు


విద్యార్థిని జ్ఞానదివ్యను అభినందిస్తున్న కేఎల్‌యూ ప్రోవీసీ ప్రసాద్, హరికిషోర్

తాడేపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో బీసీఏ చదువుతున్న జ్ఞానదివ్య అనే విద్యార్థిని ఈ నెల 4 నుంచి 13వరకు దక్షిణాఫ్రికాలో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో ఇండియా తరఫున అత్యంత ప్రతిభ కనబరిచి నాలుగు కాంస్య పతకాలు సాధించిందని కేఎల్‌యూ ప్రోవీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్ తెలిపారు. సోమవారం కెఎల్‌యూలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ స్క్వాట్ 160 కేజీల బరువులో ఒక కాంస్యం, బెంచ్ ప్రెస్ 55 కేజీలలో మరో కాంస్యం, డెడ్ లిఫ్ట్ 157.5 కిలోల బరువులో మరో కాంస్య పతకంతో పాటు ఓవరాల్‌లో మరో కాంస్య పతకం కైవసం చేసుకుందని అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో డీన్ కేఆర్ఎస్ ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ ఎ హరికిషోర్, వీసీ సారధివర్మ పాల్గొన్నారు.

16న పల్లె పండుగకు హాజరు కానున్న ఎమ్మెల్యే బూర్ల

వట్టిచెరుకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోని గ్రామాల్లో అభివృద్ధి పండుగ వాతావరణం నెలకొంది. ఈ నెల 16న మండలంలోని ఉదయం కొర్నెపాడు, మధ్యాహ్నం వింజనపాడు గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఇటీవల గ్రామసభలు నిర్వహించి అధ్వానంగా ఉన్న రోడ్లను సీసీ రోడ్లుగాను, అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజ్ నిర్మాణాలు చేసేందుకు నిధులు మంజూరైన నేపథ్యంలో శంకుస్థాపన కార్యక్రమాలకు ఎమ్మెల్యే బూర్ల హాజరు కానున్నట్టు ఎంపీడీవో రమేష్‌బాబు, మన్నవ పూర్ణచంద్రరరావు సోమవారం వెల్లడించారు.

యూనివర్సిటీల్లో వీసీలుగా బీసీ ప్రొఫెసర్లను నియమించాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

పెదకాకాని, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల వైస్-చాన్సలర్ల నియామకాలలో వెనుకబడిన తరగతులకు చెందిన ప్రొఫెసర్లను బీసీల జనాభా దామాషా మేరకు 8 మందికి తగ్గకుండా నియమించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సీఎం చంద్రబాబు వందరోజుల పాలనలో అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేస్తున్నారన్నారు. అలాగే యూనివర్సిటీలలో నియమించే రెక్టార్ రిజిస్ట్రార్, ఇతర నామినేటెడ్ పోస్టులు, విశ్వవిద్యాలయాల పాలకమండలి సభ్యులుగా బీసీ వర్గాలకు చెందిన వారిని 35శాతానికి తగ్గకుండా నియమించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు, విశ్వవిద్యాలయాలలో బీసీల బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి భర్తీ చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం అన్ని యూనివర్సిటీల వీసీలను, ఇతర అన్ని నామినేటెడ్ పోస్టులలో జగన్ సామాజికవర్గం వారిని నియమించుకోవడంతో, ఇతర సామాజిక వర్గాలకు, 54 శాతం ఉన్న బీసీలకు చాలా అన్యాయం జరిగిందన్నారు.

రెవెన్యూ సూపరింటెండెంట్‌గా రాజారమేష్

పొన్నూరు టౌన్, అక్టోబరు 14: తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా, ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రాజారమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజారమేష్ ఫిరంగిపురం మండలం నుంచి బదిలీపై పొన్నూరు వచ్చారు. పొన్నూరు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రశాంతి బదిలీపై దుగ్గిరాల సర్వే తహసీల్దార్‌గా వెళ్లారు. పొన్నూరు తహసీల్దార్‌గా నియమితులైన జియావుల్‌హక్ మాచర్లలో రిలీవ్ కాకపోవటంతో ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రాజారమేష్‌ను నియమిస్తూ జిల్లా రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజారమేష్‌ను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.



రెవెన్యూ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజారమేష్

మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ హెచ్చరికల నేపధ్యంలో పురపాలక సంఘ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేసి, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు హెల్ప్ లైన్ నెంబరును అందుబాటులోకి తీసుకువచ్చినట్టు మున్సిపల్ కమిషనర్ శేషన్న తెలిపారు. సోమవారం పురపాలక సంఘ కార్యలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వాతావరణంలో వచ్చిన మార్పులతో అధిక వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొని వచ్చేందుకు హెల్ప్‌లైన్ 1800425646 నెంబరును అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. 24 గంటలు హెల్‌లైన్ డెస్క్ అందుబాటులో ఉంటుందని కమిషనర్ శేషన్న తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 4 అర్జీలు

తెనాలి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 4 అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. వాటిలో సర్వేకి రెండు రాగా పింఛన్ కోసం ఒకటి, ఇతర సమస్యలతో మరొక అర్జీ అందినట్లు పేర్కొన్నారు. తెలిపిన ప్రతి సమస్యను నిర్ణీత సమయంలో పరిష్కరించడం జరుగుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

కొల్లిపర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో సోమవారం జూదరులపై దాడులు నిర్వహించగా చివలూరులో ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం కొల్లిపర మండలం చివలూరులో 8 మంది జూదం ఆడుతున్నట్లు సమాచారం రావటంతో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నున్న రూ.37,420, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

తిరుమలలో తెనాలి కళాకారుల కూచిపూడి నృత్యం

తెనాలి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో తెనాలి కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. యువ నర్తకి ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య శిష్య బృందం అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగిన బ్రహ్మోత్సవాలలో నృత్య ప్రదర్శన చేశారు. మహతి ఆడిటోరియంలో జరిగిన నృత్య ప్రదర్శనలో ప్రాజెక్టు అధికారులు తమ బృందాన్ని అభినందించారని ప్రఖ్య తెలిపారు.

యువ వైఖానస అసోసియేట్స్ ప్రారంభం

తెనాలి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గంగానమ్మపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో యువ వైఖానస అసోసియేట్స్‌ను సోమవారం ప్రారంభించారు. వైఖానస సేవా సంఘం అనుబంధంగా ఈ సంఘం పని చేస్తుందని సంఘ జిల్లా అధ్యక్షుడు మేడూరి శ్రీనివాసమూర్తి తెలిపారు. సభ్యులతో మాట్లాడుతూ, సంఘ సంక్షేమం కోసం సామాజిక సేవల నిమిత్తం యువతీ, యువకులను ఈ సంఘంలో చేర్చి సేవలు అందిస్తారని చెప్పారు. కన్వీనర్‌గా డాక్టర్ నారాయణ్ అనీల్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లక్ష్మీనరసింహాచార్యులు, యోగానందచక్రవర్తి, అనంతాచార్యులు, నారాయణ వేణుగోపాల్, రొంపిచర్ల కిరణ్, రాధాకృష్ణమాచార్యులు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల కేటాయింపులు పూర్తి

పొన్నూరు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో మద్యం దుకాణాల కేటాయింపు సోమవారం పూర్తి చేశారు. లాటరీ విధానంలో గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో దుకాణాల కేటాయింపు పూర్తిచేసినట్లు ఎక్సైజ్ సీఐ రమేష్ బాబు తెలిపారు. పట్టణంలోని 24వ నెంబరు షాపు అన్నేబోయిన యాదగిరి, 65వ షాపు యేమినేని రాకేష్, 66వ షాపు బండ్లమూడి అంకమ్మ చౌదరి, 67వ షాపు మధు ప్రభుకుమార్‌కు లాటరీ ద్వారా దక్కినట్లు తెలిపారు. పొన్నూరు రూరల్ మండలంలో 120 నెంబరు షాపు పొన్నం కూర్మారావు, 21వ షాపు రాయిడు హేమంతరావు, 122వ షాపు ఇకుర్తి శ్రీకాంత్‌కు దక్కినట్లు చెప్పారు. చేబ్రోలు మండలంలో 91వ నెంబరు షాపు కె .సుబ్బారావు, 92వ షాపు కె శ్రీనివాసరావు, 93వ షాపు ఏ కోటేశ్వరరావు, 94వ షాపు వి.శ్రావణ్ కుమార్‌రెడ్డి, 95వ షాపు కె లక్ష్మీనారాయణ, 96వ షాపు కె బసంత్ బాబు దక్కించుకున్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ ఆశ్రమంలో సోమవారం ఎస్‌వీ యోగా సభ్యులు రేపల్లె సత్య శ్వేతక్ పుట్టిన రోజు సందర్భంగా తల్లితండ్రులు రేపల్లె వెంకటరమణయ్య, అరుణ మరియు కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లని పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో యోగా కేంద్ర కన్వీనర్ రమణయ్య, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, తదితరులు పాల్గొన్నారు.

పెదరావూరు సీతారామస్వామి దేవస్థానానికి పూర్వవైభవం వచ్చేనా..?

● పెదరావూరు పురాతన ఆలయంలో కొరవడుతున్న సేవలు
● కూలిన ప్రహరీ, బండలు పగిలి, కోతకు గురవుతున్న మట్టి
● రథశాల లేక పురాతన రథాలు ఎండకు, వానకు రోడ్డుపైనే
● గత కొంతకాలంగా ఆగిన స్వామివారి రథోత్సవాలు
● దేవస్థానంపై ప్రత్యేక దృష్టిపెట్టాలంటున్న భక్తులు





దేవాలయ ప్రహరీ పడిపోవడంతో మట్టికోసుకుపోయి, కుంగిన బండలు



భద్రపరిచే గదిలేక పట్టాలుకప్పి ఉన్న స్వామివారి ఉత్సవమూర్తుల చెక్క మండపాలు

తెనాలి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పెదరావూరులో సీతారామస్వామివారి దేవస్థానం ఎంతోపురాతనమైనది. ఈ ఆలయానికి కొడాలి నాగయ్య వంశపారంపర్య ధర్మకర్తగా వ్యవహరించేవారు. ఆయన తరువాత కొడాలి బుచ్చయ్య, ప్రస్తుతం కొడాలి తిరువెంగళరత్నం వంశపారంపర్య ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు. ఈ ఆలయానికి సుమారుగా 33ఎకరాల 22 సెంట్లు భూమి ఉంది. దీనిలో అర్చక స్వాములకు 8ఎకరాల 82 సెంట్లు, భజంత్రీ వారికి 4ఎకరాల 34సెంట్లు, కాగాల వారికి 0.14సెంట్లు భూమి ఇచ్చారు. మిగిలిన భూమి ఆలయం కిందనే ఉంది. ఈ ఆలయంలో స్వామివారికి నిత్యం వైఖానస ఆగమం ప్రకారం పూజలు నిర్వహిస్తుంటారు. వందల ఏళ్ల నాటి చరిత్ర ఉన్న ఈ దేవస్థానానికి పొరుగు ప్రాంతాల వారు వచ్చి స్వామివార్ల దర్శనం చేసుకుని 50-70 మంది విశ్రాంతి తీసుకునేందుకు కూడా సువిశాలమైన పెంకులతో నిర్మించిన ఇల్లు కూడా ఉంది. ప్రస్తుతం ఆలయం దేవదాయ శాఖ ఆధీనంలో నడుస్తోంది. ఈ దేవస్థానంలో స్వామివారిని భక్తులు ప్రతిరోజు ఉదయం 6గంటల నుంచి 11 గంటలవరకూ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటలవరకూ దర్శించుకోవచ్చు. ఈ దేవాలయంలో ఉగాది, శ్రీరా మ న వ మి, సంక్రాంతి, ముక్కోటి, శ్రీకృష్ణాష్టమి, దసరా వంటి పండుగలను వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారి రథోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించేవారు. అయితే ఈ ఆలయానికి గత కొన్నేళ్లుగా సేవలు నిలిచిపోతున్నాయి. ఆలయంలో ఉన్న రథశాల కూలిపోయింది. వర్షానికి ఒకపక్క ప్రహరీ కొంతమేర పడిపోయింది. దీనిపై దేవస్థాన అధికారులు పెద్దగా దృష్టిపెట్టకపోవడంతో అతిపురాతనమైన రథాలు ఆలయం రోడ్డుపక్కకు చేరాయి. ఆ రథంపై ఆసునులను చేసే మండపాలు ఆలయం వెలుపలకు చేరాయి. పడిపోయిన గోడ స్థానంలో పరదాలు వెలిశాయి. కింద బండలు సైతం మట్టికోసుకుపోయి పగుళ్లు ఇచ్చి కళావిహీనంగా మారాయి. గత కొంతకాలంగా స్వామివారి ప్రత్యేక పర్వదినాల్లో జరిగే గ్రామోత్సవం కూడా జరగడంలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. వందల నాటి చరిత్ర ఉన్న ఆలయంలో స్వామివారి కల్యాణం అనంతరం రథోత్సవం జరిగేది. రథశాల లేక రోడ్లపై ఎండకు ఎండి, వానకు తడిచి అవి రథోత్సవానికి వినియోగించే వీలులేక నిరుపయోగంగా పడిఉన్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామివారికి ఉన్న భూమితో వచ్చే ఆదాయంతోనైనా దేవస్థానంలోని ఈ సమస్యలను పరిష్కరించే వీలుంది. అయితే దీనిపై అధికారులు దృష్టిపెట్టడంలేదని పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పూర్వీకుల నుంచి స్వామివారిపై భక్తిశ్రద్ధలతో తయారు చేయించిన రథాలను తిరిగి మరమ్మతులు చేయించి దేవస్థానంలో రథశాలను నిర్మించడంతో పాటు ప్రహరీని కూడా ఏర్పాటుచేసి భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా దేవదాయశాఖ చర్యలు చేపట్టాలని పలువురు భక్తులు కోరుతున్నారు. రాబోయే రోజుల్లో దేవస్థానంలో జరిగే ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి రథోత్సవం బాజాభజంత్రీలతో కాగడాల వెలుగుల్లో భక్తుల రామనామ కీర్తనలతో పూర్వవైభవం వచ్చేలా దేవస్థాన నిర్వాహకులు, ప్రభుత్వం దృష్టిపెట్టాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కొప్పురావూరు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర, సర్పంచ్ పూర్ణ తదితరులు

గ్రామాలను సస్యశ్యామలం చేస్తాం

● పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్
● అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదకాకాని, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని గ్రామాలను సస్యశ్యామలంగా అభివృద్ధి చేస్తానని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా పెదకాకాని మండలంలోని పెదకాకాని, నంబూరు, కొప్పురావూరు, తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాలలో రూ. కోటి నిధులతో సీసీ రోడ్లు, సీసీ కాల్వలుకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.4500 కోట్లతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపట్టనుందని తెలిపారు. గత వైసీపీ పాలనలో జగన్ మోహన్‌రెడ్డి పంచాయతీ నిధులను దారి మళ్ళించి గ్రామాల అభివృద్ధి కుంటుపడేలా చేశారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు గ్రామ పంచాయతీల అభివృద్ధికి యుద్ధ ప్రాతిపదిక నిధులను కేటాయిస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కాకాని మల్లేశ్వరుని దర్శించుకున్న ఐజీ రామకృష్ణ



ఐజీ రామకృష్ణకు చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో గోగినేని లీలా కుమార్

పెదకాకాని అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర ఇంటిలిజెన్స్ ఐజీ పీహెచ్‌డీ రామకృష్ణ సోమవారం సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మల్లేశ్వర స్వామి, భ్రమరాంబ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఐజీ పీహెచ్‌డీ రామకృష్ణ స్వామి వారి జ్ఞాపికను ఆలయ ఈవో లీలాకుమార్ అందజేశారు.

భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తం



భారీ వర్షానికి జలమయమైన జీబీసీ రోడ్డు

పొన్నూరు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో సోమవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది, ఉదయం నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆకాశం దట్టంగా మేఘావృతం అవటమే కాకుండా పగలు కూడా చీకట్లు కమ్ముకొచ్చినట్లు కారుమబ్బులు కమ్మేశాయి. ఉరుములు, మెరుపులతో, పిడుగులతో రోజంగా కుండపోత వర్షం కురుస్తూనే ఉంది. ఈ భారీ వర్షానికి పొన్నూరు పట్టణంలోని ప్రధాన రహదారి దారులు జలమయమై కాల్వలను తలపించాయి. పల్లపు ప్రాంతాలలో భారీగా వర్షపు నీరు నిలిచింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలపై పట్టణంలోని డీపీసీ కాలనీ, నిడుబ్రోలులోని ఎరుకులవాడ, తదితర ప్రాంతాలోని జనావాసాలు నీటి ముంపునకు గురయ్యాయి. అయితే ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు జనావాసాలను వర్షపునీరు ముంచెత్తకుండా పురపాలక సంఘం అధికారులు నీటి మళ్లింపు చర్యలను చేపట్టారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, రేపల్లె బస్టాండ్ సెంటర్, సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద రహదారులపై భారీగా వర్షపు నీరు చేరింది. పలు వార్డులు, గ్రామాలోని అంతర్గత రహదారులో భారీగా వర్షపు నీరు నిల్వ ఉంది. రోజంతా వర్ష కురుస్తూనే ఉండటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాన నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. మరో వైపు భారీ వర్షానికి పంట పోలాలోకి వర్షపు నీరు చేరటంతో రైతులో ఆందోళన నెలకొంది. ఇటీవలే భారీ వర్షాలకు పంట చేలు నీటి ముంపునకు గురై దెబ్బతినగా ఇప్పుడిప్పుడే కొలుకొంటున్న రైతులు తిరిగి వర్షాలు కురుస్తుండటంతో మిగిలివున్న కొద్దిపాటి పంట కూడా వర్షాలకు దెబ్బతింటుందేమోనన్ని ఆందోళనలో ఉన్నారు. మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో సర్వత్రా ఆందోళన నెలకొంది.

జలమయమైన రోడ్లు

కొల్లిపర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం కారణంగా మండలంలో సోమవారం మబ్బులు కమ్ముకువచ్చి ఉరుములతో కుంభవృష్టిగా వర్షం పడింది. ఎడతెరిపిలేని వర్షంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వర్షపు నీటికి రోడ్లు జలమయమవటంతో పాటు మురుగు కాల్వల్లోని నీరు ఎక్కడికక్కడ స్తంభించాయి. తూములూరు, దావులూరు, దావులూరుపాలెం, కొల్లిపర తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు సైతం వర్షం నీటితో నిండిపోయాయి. రహదారులపై గజంలోతు నీరు చేరడంతో వాహనాదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు.





తూములూరు, వల్లభాపురంలో సిమెంట్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఏఎస్ఎన్ కళాశాలకు ఇంటర్న్‌షిప్ అవార్డు



అవార్డుతో మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే, కరస్పాండెంట్ శివకుమార్, ప్రిన్సిపాల్

తెనాలి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెనాలి ఎఎస్ఎన్ డిగ్రీ కళాశాలకు వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లో ఆలిండియాలో 3వ ర్యాంకు లభించింది. కళాశాలలో సోమవారం మాజీ ఎమ్మెల్యే, ఏఎస్ఎన్ విద్యా సంస్థల ఛైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏఐసీటీఈ, ఎడుస్కిల్స్ జాతీయ ఇంటర్న్‌షిప్ పోర్టల్ 2023-24లో విద్యా సంస్థలను ఎంపిక చేసిందని తెలిపారు. కళాశాలలో చేరిన విద్యార్థులకు కామర్స్, మేనేజ్‌మెంట్, ఏఐ ఎంఎల్, డేటా సైన్స్ విభాగాల్లో ఆన్‌లైన్ సర్టిఫికేషన్స్ చేయించడం, స్కిల్స్ పెంపొందించడం, ప్రాజెక్టులు చేయించడం, క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించడం వంటి అంశాలను పరిశీలించి ఈ అవార్డు ప్రకటించారని చెప్పారు. సౌత్ సెంట్రల్ జోన్స్‌లో బెస్ట్ పెర్ఫార్మింగ్ కళాశాలగా అవార్డు పొందామన్నారు. ప్రిన్సిపాల్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు కూడా పొందినట్లు చెప్పారు. ఈ అవార్డు సాధించేందుకు కృషి చేసిన ప్రిన్సిపల్ కొలసాని రాంచంద్, అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు.



పెదకాకాని పంచాయతీ రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పెదకాకానిలో కేంద్ర బృందం పర్యటన

పెదకాకాని, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పెదకాకానిలో కేంద్ర బృందం సోమవారం పర్యటించింది. ఎన్ఎల్ఎంటీ అధికారులైన సురేంద్రనాథ్, అశోక్ సాహులు పెదకాకాని పంచాయతీలోని ఎన్ఆర్ఈజీఎస్ రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత డ్వాక్రా మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

మద్యం షాపుల విజేతలు వీరే

తెనాలి క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 25 మద్యం షాపులను దక్కించుకున్న వారి వివరాలను సీఐ వెంకటాచలం సోమవారం సాయంత్రం వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలోని వరుసగా 53వ నెంబరు షాపు నుంచి 63 షాపుల వరకు పొందినవారు ఎస్.సురేంద్ర, సోంపల్లి మల్లిఖార్జున, కొల్లి నాగఫణీంద్రరెడ్డి, పావులూరి వెంకటరాంబాబు, చల్లపల్లి రవిచంద్రచౌదరి, తూళ్లూరు బాలాజీ, కోటిపల్లి శ్రీనివాసరావు, సూరపనేని కిరణ్‌కుమార్, వెలగా సత్యనారాయణ, వెలగా శ్రీహర్ష, కె.సాంబశివరావులకు దక్కగా తెనాలి రూరల్‌లో 106వ నెంబరు నుండి 110వ షాపు వరకు వరుసగా పొందిన వారు గురినేని అనీల్‌కుమార్, కాళహస్తి రాజేష్, ఈదర వెంకటపూర్ణచంద్, మొవ్వా బాలకిరణ్, నారా వెంకటేశ్వరరావు, దుగ్గిరాల మండలంలో 111వ షాపు నుంచి 115వ నెంబరు షాపు వరుసగా నారిశెట్టి శ్రీనివాసరావు, రాయల నరసింహ, బి.సరస్వతి, తేలుకుంట్ల చాణుక్య గూడూరు వెంకట్రావు, కొల్లిపర మండలంలో 116వ షాపు నుండి 119వ నెంబరు షాపు వరకు పొందిన వారు భరణం హరిబాబు, కోట గణేష్, గుదిబండి నాగిరెడ్డి, అరుమళ్ల నాగిరెడ్డి షాపులు పొందారని సీఐ తెలిపారు.



కొల్లిపర శ్రీవీరభద్రస్వామి కాలనీలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం

కొల్లిపర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం దుర్గాదేవి నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండలంలో వల్లభాపురం, మున్నంగి, తూములూరు, అత్తోట, దావులూరుపాలెం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలకు భక్తులు 12 రోజుల నుంచి వైభవంగా పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ట్రాక్టర్‌పై ఊరేగింపు నిర్వహించి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. అదేవిధంగా కొల్లిపర శ్రీవీరభద్రస్వామికాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టరుపై శ్రీ దుర్గాదేవి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలతో, డబ్బు వాయిద్యాలతో, బాణా సంచా కాల్చుకుంటూ గ్రామపురవీథుల్లో ఊరేగింపు నిర్వహించి కృష్ణానదిలో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

స్వర్ణాంధ్ర పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని నజ్మా

పొన్నూరు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం ఏడుకొండలు తెలిపారు. వ్యాసరచన పోటీల్లో 9వ తరగతి చదువుతున్న షేక్ నజ్మా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, డిబేట్‌లో డీ.ధరణి, కే.హారిక ప్రథమస్థానం, ఎల్యూకేషన్ పోటీలో డీ, ధరణి ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. విజేతలకు సోమవారం ఆర్డీవో కే శ్రీనివాసరావు, డీఆర్వో రోజా, డీపీఎం ఏ లక్ష్మీకుమారి, డీఈవో పీ. శైలజ ప్రసంశాపత్రాలను, బహుమతులను అందచేశారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదల వెంకటేశ్వరరావు

పొన్నూరు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు త్వరలో జరగనున్న సాగు నీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం కావాలని ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మండలంలోని రైతులు, కౌలు రైతులతో పాటు టీడీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. నవంబరులో సాగు నీటి సంఘాలకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రైతులు, కౌలు రైతులు తమ ఓటు హక్కు నమోదుపై జాగ్రత్తలు పాటించాలన్నారు. తహసీల్దార్ కార్యాలంలో 1బీ, అడంగల్‌లో నమోదైన రైతులను సాగు నీటి సంఘాల ఎన్నికలకు ఓటర్లుగా పరిగణించనునట్లు పేర్కొన్నారు. పొన్నూరు మండలంలో 14 సాగు నీటి సంఘాలు, 2 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగనునట్లు తెలిపారు. సమావేశంలో రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు, గనిపిశెట్టి రామకృష్ణ, సొపాటి వెంకట్రావు, రాధాకృష్ణ, మున్నంగి సుబ్బారెడ్డి, గూడపాటి కాల్లేశ్వరరావు, దొప్పలపూడి సాంబశివరావు, సజ్జా బ్రహ్మయ్య, రామినేని శ్రీనివాసరావు తదితరులతో పాటు వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా: కార్యదర్శి



కార్యదర్శి అనీల్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాగభూషణం, తదితరులు

తెనాలిరూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అంగలకుదురు గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన బొల్లు అనీల్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని అంగలకుదురు పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో ప్రకాశం జిల్లాలో పనిచేసిన అనీల్‌కుమార్ సాధారణ బదిలీల్లో భాగంగా అంగలకుదురు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ప్రసాదరావు పెదకాకాని మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా అనీల్‌కుమార్‌ను గ్రామ ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, పాలక సభ్యులు, కార్యాలయ ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.